శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త





## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, డిసెంబరు 3, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి బుధవారం సాయంత్రానికి 17122.19 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 70.359 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్సికి 200, ఎన్ఎఫ్సికి50, పెన్నా డెల్టా 0, కండలేరు వరద కాలువకు 2000 క్యూసెక్కులు, పెన్నా నదికి 2650 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.534 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# సుపరిపాలనే ధ్యేయంగా ఈ నెలలో పెద్దఎత్తున ప్రభుత్వ కార్యక్రమాలు

- అన్నదాతలకు భరోసా కల్పించడమే లక్ష్యంగా రైతన్న మీ కోసం
- 4న జిల్లా వ్యాప్తంగా డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాలు ప్రారంభం
- డీడీవో కార్యాలయాలతో పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతానికి చర్యలు
- 5న జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో మెగా పేటీఎం
- జిల్లాల పునర్విభజన అభ్యంతరాలను సీఎం దృష్టికి తీసుకెళ్తాం
- రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**నెల్లూరు, డిసెంబర్ 3, ప్రభాతవార్త-వైద్యం** రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమాన్ని సమ్మిళితం చేస్తూ ప్రజలకు సుపరిపాలన అందించడమే ప్రధాన లక్ష్యంగా ఈనెలలో పెద్ద ఎత్తున ప్రభుత్వ కార్యక్రమాలు చేపడుతున్నట్లు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం నెల్లూరు సంతపేటలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పలు ప్రభుత్వ కార్యక్రమాలపై ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సుపరిపలన అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. 3వ తేదీ నుంచి రైతన్న మీ కోసం 4న అన్ని నియోజకవర్గాల్లో డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాల ప్రారంభోత్సవం, 5న మెగా పేటీఎం కార్యక్రమాలను పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

### రైతులకు ప్రభుత్వం తోడుగా ఉంటుందనే భరోసా కల్పించేందుకు రైతన్న మీ కోసం

రైతులకు ఇటీవల అన్నదాత సుఖీభవ.. పీఎం కిసాన్ నిధులను జమ చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రైతాంగానికి తమ ప్రభుత్వం ఎప్పుడూ తోడుగా ఉంటుందని భరోసా కల్పించేందుకు రైతన్న మీ కోసం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. 3న రైతన్న మీ కోసం కార్యక్రమంలో ముఖ్యమంత్రి తూర్పు గోదావరి జిల్లాలో పాల్గొన్నారని చెప్పారు. మన జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున త్వరలోనే అన్ని గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పెద్ద ఎత్తున ఐతన్న మీ కోసం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. రైతులకు ఈ ఖరీఫ్ సీజన్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అందిస్తూ వారికి అన్ని విధాల ప్రభుత్వం అండగా ఉందని చెప్పడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా మంత్రి చెప్పారు.

### 4న పండుగ వాతావరణంలో డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాల ప్రారంభోత్సవం

గ్రామీణ పంచాయతీ రాజ్ వ్యవస్థను పటిష్టం చేసి ప్రజలకు పాలనను మరింత సులభతరం చేయడం, పంచాయతీ ఆజ్ వ్యవస్థను పర్యవేక్షించి పటిష్టమైన పరిపాలన విధానాన్ని తీసుకురావాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డివిజన్ కేంద్రాల్లో డివిజనల్ అభివృద్ధి కార్యాలయాలను ప్రభుత్వం ప్రారంభిస్తుందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఈనెల 4న చిత్తూరు జిల్లాలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ డీడీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తుండగా, వర్చువల్గా జరిగే కార్యక్రమాల్లో స్థానికంగా మంత్రులు, ఎమ్మెల్యే పాల్గొంటారని చెప్పారు. ఆత్మకూరులో డీడీవో కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తాను పాల్గొంటున్నట్లు మంత్రి వెల్లడించారు. నెల్లూరులో మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యాలయాల ద్వారా గ్రామీణ వ్యవస్థ బలోపేతంతో పాటు గ్రామాల అభివృద్ధి మరింత వేగవంతం కానుందని ఆయన చెప్పారు.

### 5న మెగా పేటీఎం

5న రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో మెగా పేటీఎం నిర్వహణకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాలు జారీ చేశారని, ఆ మేరకు జిల్లా వ్యాప్తంగా మెగా పేటీఎం కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆత్మకూరు నియోజకవర్గం చేజర్లలోని ప్రభుత్వ పాఠశాలలో జరిగే కార్యక్రమంలో తాను పాల్గొంటానని, ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొంటారని మంత్రి చెప్పారు. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయుల మధ్య ఒక ఆహ్లాదకరమైన వాతావరణం కోసం, విద్యార్థుల ప్రతిభాపాఠవాలు మెరుగుపరిచేందుకు పాఠశాల అభివృద్ధి కోసం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

### పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా కార్యక్రమాలు

తెలుగుదేశం పార్టీని బూత్స్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలకు శిక్షణ, గ్రామాల్లో బూత్ స్థాయిలో పార్టీ స్థితిగతుల గురించి విశ్లేషణ, భవిష్యత్తులో పార్టీ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి ఆనం చెప్పారు. ఆత్మకూరు నియోజకవర్గానికి 8మంది పరిశీలకులను పార్టీ నియమించినట్లు మంత్రి చెప్పారు. బూత్ స్థాయి నుంచే పార్టీని బలోపేతం చేసేందుకు, అందరిని సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తామని చెప్పారు. ఒక నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం పార్టీ బలోపేతంపై దృష్టిపెట్టినట్లు చెప్పారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ 2029 ఎన్నికలే లక్ష్యంగా పార్టీని బూత్ స్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా ఇప్పటి నుంచే దృష్టిపెట్టినట్లు చెప్పారు. క్రమశిక్షణ, నిబద్ధతకు మారుపేరు తెలుగుదేశం పార్టీ అని, కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ, భవిష్యత్తో చేపట్టాల్సిన కార్యక్రమాలకు కూడా కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బూత్స్థాయిలో లోటుపాట్లను సరిదిద్దుకుని అందరిని సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు.

### ముఖ్యమంత్రి దృష్టికి జిల్లా పునర్విభజన సమస్యలు : మంత్రి ఆనం

జిల్లాల పునర్విభజనపై అభ్యంతరాలు తెలిపేందుకు 30 రోజుల గడువును ప్రభుత్వం ప్రకటించిందని, ఈ లోగా ప్రజలు, ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన అభ్యంతరాలను, సలహాలను మంత్రివర్గ ఉపసంఘం దృష్టికి తీసుకెళ్తామని, అన్ని విషయాలను కూలంకుషంగా చర్చించిన తదుపరి సీఎం చంద్రబాబునాయుడు తది నిర్ణయం ప్రకటిస్తారని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్, బొల్లినేని గిరినాయుడు, కేశవ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## విజన్ బిల్డింగ్ ప్రతి మహిళకు అభివృద్ధికి చాలా ముఖ్యమైనది




**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 3, ప్రభాతవార్త** జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, నెల్లూరు కార్యాలయంలో జిల్లాలోని 10 మోడల్ మండలంకు విజన్ బిల్డింగ్ మీద శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టరు వి.నాగరాజ కుమారి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ మండలం, పొదలకూరు, సంగం, దగదర్తి, తోటపల్లి గూడూరు, మర్రిపాడు, కందుకూరు, కావలి, అల్లూరు మరియు రాపూరు మండలాల నుండి ఏపిఎంలు, సిసిలు, అక్కౌంటెంట్లు, ఎల్సి సిసిలు, నెల్లూరు రూరల్ మండల సమాఖ్య ఈసి సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమములో భాగముగా డిఆర్డిఏ, ప్రాజెక్ట్ డైరెక్టరు వి.నాగరాజ కుమారి మాట్లాడుతూ విజన్ బిల్డింగ్ శిక్షణా కార్యక్రమం ప్రతి మహిళ అభివృద్ధికి చాలా ముఖ్యమైనది. ప్రతి మహిళ తన భవిష్యత్ పైన కలలు కనాలి, ఆ కలలను సాకారం చేసుకోవడానికి మహిళలు వ్యక్తిగతంగా, కుటుంబపరంగా, సామాజిక పరంగా అందుబాటులో ఉన్న సాంకేతికతను సక్రమముగా ఉపయోగించుకొని విజయం సాధించాలని సూచించడం జరిగినది. ప్రతి సంఘంకు, గ్రామ సంఘాలకు, మండల సమాఖ్యలకు కూడ ఒక విజన్ ఉండాలి. కలని, గమ్యంను చేరుకోవడానికి ఈ శిక్షణ సభ్యులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిపిఎం ఐబి, ఏజిఎం అండ్ 2, డిపిఎం ఎల్హెచ్, డిపిఎం ఫైనాన్స్, డిపిఎం లివ్ స్టాక్, జెడిఎం జాబ్స్, నెల్లూరు రూరల్ మండల ఏపిఎం, సిసిలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు డివిజనల్ డెవలప్మెంట్ అధికారి కార్యాలయం ప్రారంభం

- చిత్తూరు నుండి వర్చువల్ ప్రారంభించనున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్




**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 3, ప్రభాతవార్త** నెల్లూరు పట్టణంలోని పొదలకూరు రోడ్డున గల నూతన జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో గల నెల్లూరు డివిజనల్ డెవలప్మెంట్ అధికారి వారి కార్యాలయంను ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, రాష్ట్రంలోని అన్ని డివిజనల్ డెవలప్మెంట్ అధికారి వారి కార్యాలయంను నేడు చిత్తూరు నుండి వర్చువల్ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు డివిజన్కు సంబంధించిన స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్ రెవెన్యూ డివిజనల్ అధికారి, నెల్లూరు వారు సబ్ డివిజనల్ పోలీసు అధికారి, నెల్లూరు వారు, ఇతర అధికారులు హాజరుకానున్నారని డీపీఓ వసుమతి ఒక ప్రకటనలో తెలిపారు.

## బీదాని కలిసిన జడ్పీ సీఈఓ శ్రీధర్ రెడ్డి



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 3, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా జడ్పీ సీఈఓగా ఇటీవల నియమితులైన శ్రీధర్ రెడ్డి బుధవారం శాసనమండలి సభ్యులు బీద రవిచంద్రను నెల్లూరు నగరం, మాగుంట లేఔట్లోని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు అనేక కార్యక్రమాలపై వారు చర్చించారు.

## డిమాండ్ల పరిష్కారం కోసం వినతి పత్రం



**ఉదయగిరి, డిసెంబర్ 3, ప్రభాతవార్త** ఉదయగిరి మండల పరిధిలో ఉన్నటువంటి వీఆర్ఏలు సమస్యలపై డిప్యూటీ తహసీల్దారుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పరిష్కారం కాని తమ సమస్యలను పరిష్కరించాలంటూ వీఆర్ఏలు బుధవారం తహసీల్దార్కు వినతిపత్రం అందజేశారు. పనికి తగ్గ వేతనం ఇవ్వాలని తమకు కారుణ్య నియామకాలు ఇవ్వాలని, అటెండర్ పోస్టులు వీఆర్వో పోస్టులు, ఇవ్వాలని తహసీల్దార్ కార్యాలయంలో వాచ్మెన్గా అలాగే పని చేసే వేళలు మార్చమని ఆఫ్ డ్యూటీ అని చెప్పి ఫుల్ డ్యూటీ చేస్తున్నామని ఈపద్ధతి మార్చేవిధంగా చొరువ తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.

## మోటార్ సైకిళ్ల దొంగ అరెస్టు

- 11 మోటార్ సైకిళ్లు, ఒక ఆటో స్వాధీనం



**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 3, ప్రభాతవార్త :** తీగ లాగితే డొంకంతా కదిలినట్లు ఒక స్కూటర్ జోరీ విషయంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులకు దాంతోపాటు మరో 11 వాహనాలను చోరీచేసిన దొంగ చిక్కాడు చిన్న బజార్ సీఐ చిట్టెం కోటేశ్వరరావు కథనం మేరకు అక్టోబర్ 22వ తేదీ మనుబోలుకు చెందిన జుల్ఫికర్ ఆలీ అనే వ్యక్తి పొగతోటలోని హోటల్ వద్ద తన వాహనాన్ని నిలిపి, టిఫిన్ చేసేందుకు లోపలికి వెళ్ళాడు. తిరిగి వచ్చి చూడగా తన ఆటో కనపడడం లేదని అదే రోజు చిన్న బజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నెల్లూరు రూరల్ మండలం ఎలమవారి దిన్నెకు చెందిన పి.కళ్యాణ్ కుమార్ అనే ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. దొంగిలించిన ఆటోతో పారిపోయేందుకు ప్రయత్నిస్తున్న కళ్యాణ్ కుమార్ను చిన్న బజార్ సీఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్సై అబ్దుల్ రజాక్ అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు మరో పదకొండు మోటార్ సైకిల్లను దొంగలించినట్లు తెలుసుకున్నారు. నిందితుడు వద్దనుండి 11 మోటార్ సైకిళ్ళు, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రతిభ కనపరిచిన పోలీస్ అధికారులను సిబ్బందిని ఎస్పీ అజిత వేజెండ్ల, నగర ఇన్చార్జి డిఎస్పి గిరిధర్ అభినందించారు.

## జొన్నవాడ కామాక్షితాయి హుండి లెక్కింపు



**బుచ్చి డిసెంబర్ 3 ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ శ్రీమల్లికార్జున స్వామి కామాక్షితాయి హుండి లెక్కింపు బుధవారం నిర్వహించారు. దేవాదాయ, ధర్మదాయ శాఖ అధికారులు,చైర్మన్ ,పాలక మండలి సభ్యులు ,దేవస్థాన సహాయ కమీషనర్, కార్యనిర్వహణ అధికారి సమక్షంలో హుండిలు తెరచి భక్తులు శ్రీవార్లకు సమర్పించిన కానుకలను లెక్కించారు.30.8.25 నుండి 2.12.25 వరకు 95 రోజులకు శ్రీవార్ల ప్రధాన ఆలయ హుండీలు ద్వారా ఆదాయం 48,89,218, యూఎస్ డాలర్స్ 123,కెనడియన్ డాలర్ 15, బంగారు వస్తువులు 71 గ్రాములు 500 మిల్లీగ్రాములు, వెండి వస్తువులు 170 గ్రాములు అన్న ప్రసాద హుండి ద్వారా 3,14,050, భక్తులు శ్రీవార్ల హుండి ద్వారా సమర్పించారు. ఈకార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ తిరుమూరు అశోక్రెడ్డి, దేవస్థాన సహాయ కమీషనర్ కార్యనిర్వహణాధికారి ఆర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, పాలక మండలి సభ్యులు ముంగరసుధాకర్, రామాయణం సుధారాణి, పర్యవేక్షణధికారి రామలింగేశ్వరస్వామి దేవస్థానం,పూడిపర్తి, స్థానిక ఏపిజి బ్యాంకు అధికారులు, ఆలయ సిబ్బంది ఎస్.సుబ్బరాయుడు, ఆద్వర్యంలో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండిఆయా రిటైడ్ ఉద్యోగులు, ఒ వెంకయ్య, ఎఎస్ఐ బుచ్చిరెడ్డిపాళెం,జొన్నవాడ గ్రామ రెవిన్యూ అధికారులు ఆలయ అర్చకులు, సిబ్బంది,భక్తులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని వ్యక్తి మృతి

**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 3, ప్రభాతవార్త :** ప్రమాదవశాత్తు లారీ ఢీకొనడంతో మరో వాహనానికి చెందిన డ్రైవర్ మృతి చెందిన సంఘటన నగర శివార్లలోని కనుపర్తిపాడు క్రాస్ రోడ్డు వద్ద బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు కృష్ణాజిల్లా చర్లపల్లికి చెందిన సాంబశివరావు (64) పాల ట్యాంకర్కు డ్రైవపాల ట్యాంకర్ డ్రైవర్ గా పనిచేస్తుంటాడు. బుధవారం ఉదయం విజయవాడ నుండి చెన్నైకు పాల ట్యాంకర్ తీసుకెళ్తుండగా కనుపర్తిపాడు క్రాస్ రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై ట్యాంకర్ మరమ్మతుకు గురి కావడంతో ట్యాంకర్ ను రోడ్డు పక్కన నిలిపి, వెనుక వైపు టైర్ల వద్ద పరిశీలిస్తుండగా, అదే సమయంలో కావలి నుండి చెన్నై వైపు ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ సాంబ శివరావు బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న నెల్లూరు సౌత్ ట్రాఫిక్ పోలీసులు మృతుని కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

## కోట్ల విలువైన భూములను దానం చేసిన కుటుంబం మాది

- కేసులకు భయపడి తప్పించుకు తిరిగిన చరిత్ర కాకాణిది - సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి
- కాకాణి పై రూరల్ పోలీసులకు ఫిర్యాదు



**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 3, ప్రభాతవార్త :** స్కూళ్లు, ఆస్పత్రి, కాలనీలకు రూ.60 కోట్ల విలువ చేసే భూములు ఇచ్చిన చరిత్ర తమ కుటుంబానిదని, దళితుల భూములు, విశ్రాంత ఉద్యోగుల స్థలాలు కబ్జా చేసిన ఘనత కాకాణి ఫ్యామిలీదని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి దూషణలు, అడ్డగోలు ఆరోపణలు తదితర అంశాలపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని నెల్లూరు రూరల్ పోలీసులకు బుధవారం సోమిరెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఆస్తులను ఉదారంగా వదిలేసిన తాము శివాలయం భూమిని అమ్ముకుంటామా అని ప్రశ్నించారు. కాకుటూరు శివాలయం భూమి ఒక్క సెంటూ ఎవరికీ రిజిస్టర్ కాలేదని, మట్టి రహదారిపై సిమెంట్ రోడ్డు వేస్తే కాకాణికి అంత కడుపు మంట ఎందుకో అర్థం కావట్లేదన్నారు. కండీషన్ బెయిల్ పై ఉన్నాడనే విషయం గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు. దాత అల్లూరు శంకర్ రెడ్డి తన స్నేహితుడు డబ్బు గుంట రమణయ్య పేరుతో 48 సెంట్ల పట్టా భూమిని వెంకటాచలం మండలంలోని కాకుటూరు శివాలయం నిర్వహణ కోసం దశాబ్దాల క్రితం రాసిచ్చారని వివరించారు. మహాశివుడికే తాను శఠగోపం పెట్టానంటూ, రూ.కోటి తీసుకుని శివుడి భూమిని అమ్మేశానని కాకాణి నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. 2005 లో స్వర్ణ చతుర్భుజి రోడ్డు నిర్మాణం జరిగేటప్పుడు హైవే కోసమని 8 సెంట్లు సేకరించాని, దానికి సంబంధించి ఇంకా పరిహారం కూడా అందలేదని స్పష్టం చేశారు. గుడికి, హైవేకి మధ్య మరో 8 సెంట్లు భూమి ఉందని, గుడి ఆవరణలో 15 సెంట్లు, శివాలయానికి దక్షిణాన గతంలో 15 సెంట్లలో మట్టి రోడ్డు, మరో 2 సెంట్లు జైన్ టెంపుల్ భూమిలో కలసివుందని వివరించారు. ఎన్నో ఏళ్లుగా గుడికి దక్షిణాన ఉన్న మట్టి రహదారిపై సిమెంట్ రోడ్డు వేసి, గుడికి తూర్పు వైపున 3 సెంట్లు భూమి ఇవ్వడంతో పాటు దేవస్థానం అభివృద్ధికి రూ.40 లక్షలు రియల్ ఎస్టేట్ సంస్థ ఇస్తున్నారని స్పష్టంచేశారు. 11 మంది కమిటీగా ఏర్పడి శివాలయం నిర్వహణ బాధ్యతలు పర్యవేక్షిస్తున్నారని, వారి అంగీకారంతోనే మట్టి రోడ్డును సిమెంట్ రోడ్డుగా మార్చారని గుర్తు చేశారు. జరిగిన వాస్తవం ఇదయితే.. తాను రూ.కోటి తీసుకుని శివాలయం భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్ముకున్నానని చెప్పడమేమిటని ప్రశ్నించారు. తమ కుటుంబం రూ.60 కోట్లు విలువచేసే 14.5 ఎకరాలను ప్రజల కోసం దానం చేసిందని పేర్కొన్నారు. కాకాణి కుటుంబం ప్రజలకు ఏమి ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. దళితుల భూములను తన భూముల్లో కలిపేసుకున్న ఘనత కాకాణిదని ఆరోపించారు. సర్వే పల్లిలోనే 6.30 ఎకరాల గిరిజనుల భూములను కాకాణి అనుచరులు రూ.35 లక్షల చొప్పున అమ్మేసుకున్నారని, కాకాణి ప్రోద్బలంతోనే ఈ దందా జరిగిందని సోమిరెడ్డి ఆరోపించారు. గిరిజనుల భూమి విషయంలో అప్పటి నెల్లూరు ఆర్డీఓను కోర్టులో కౌంటర్ ఫైల్ చేయనీయకుండా అధికార బలంతో అడ్డుకున్నాడని తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రిగా మొదటి పంటలో 3 లక్షల ఎకరాలు బీడు పెట్టించిన కాకాణి దగ్గర తాను నేర్చుకోవాలా.. అని ప్రశ్నించారు. ఇరిగేషన్ రంగంలో జరిగిన అక్రమాలపై కేసులు నమోదైతే కాకాణితో పాటు ఆయన ఐదుగురి ముఠా జైలుకెళ్లడం ఖాయమని సోమిరెడ్డి స్పష్టం చేశారు. అంత క్రితం నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్లో కాకాణి గోవర్ధన్ రెడ్డి పై సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నెల్లూరు రూరల్ డిఎస్పి ఘట్టమనేని శ్రీనివాసరావు, సీఐ గుంజి వేణులకు ఫిర్యాదు చేశారు.

## నీటి మునిగిన ప్రభుత్వ కార్యాలయాలు



**కొడవలూరు, డిసెంబర్ 3 ప్రభాతవార్త :** దిత్వాతుఫాన్ ప్రభావం వలన కురిసిన వర్షాలకు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణంలు నీటి మునిగి ప్రజలకు దర్శనమిస్తున్నాయి. సంఘమిత్ర ఎంజీఆర్ ఈజీఎస్, హౌసింగ్ కార్యాలయ అదికారులకు, మండల ప్రజలకు నిల్వ చేరిన వర్షపునీటితో అగచాట్లు తప్పడం లేదు. ఎంతోమంది ఉన్నత అధికారులు వస్తూ వెలుతుంటారే తప్పా పట్టించుకునే వారు లేక కొన్నేళ్ళ నుంచి ఈ సమస్య ఇలాగే ఉంది. విధి నిర్వహణలో మండల అధికారుల నిర్లక్ష్య వైఖరి అంటూ ప్రభుత్వ కార్యాలయలకు వచ్చే ప్రజలు చర్చించుకోవడం విశేషం.

## బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు చర్యలు తీసుకోండి

- పట్టణ పరిధిలో ట్రాఫిక్ రద్దీ తీవ్రమైన సమస్యగా మారింది
- పాదచారులకు ప్రత్యేక ఫుట్పాత్ లేకపోవడంతో సమస్యలు
- కాబట్టి బుచ్చిరెడ్డిపాలెంలో లోడ్ బేరింగ్ పేపర్ బ్లాక్లు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించండి
- జాతీయ రహదారుల ప్రాదికార సంస్థ చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్కు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్రెడ్డి వినతి
- సానుకూలంగా స్పందించిన చైర్మన్, చర్యలు తీసుకుంటామని వెల్లడి



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 3, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా కోవూరు అసెంబ్లీ పరిధిలోని బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ గుండా వెళ్లే జాతీయ రహదారి-67 పై (మంచీలూరు నుంచి నెల్లూరు వరకు) లోడ్ బేరింగ్ పేపర్ బ్లాక్ల నిర్మాణం చేపట్టాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్రెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ చైర్మన్ సంతోష్కుమార్ యాదవ్ను ఢిల్లీలోని ఆయన ఛాంబర్లో కలుసుకుని ఇందుకు సంబంధించి వినతి అందజేశారు. బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ పరిధిలో ఎన్హెచ్-67 (మంచీలూరు నుండి నెల్లూరు వరకు) సెక్షన్లో కి.మీ 722.33 నుంచి కి.మీ 724.800 వరకు లోడ్ బేరింగ్ పేపర్ బ్లాక్ల నిర్మాణ పనులను తక్షణమే చేపట్టాల్సిన అవసరం ఉందని ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. ప్రస్తుతం బుచ్చిరెడ్డిపాలెం పట్టణ పరిధిలో ట్రాఫిక్ రద్దీ తీవ్రమైన సమస్యగా మారిందని, దీని కారణంగా తాత్కాలిక షెడ్లు, నెట్టడం బండ్ల రూపంలో రోడ్డుపై ఆక్రమణలు పెరుగుతున్నాయన్నారు. వాహనాలను సక్రమంగా పార్కింగ్ చేయకపోవడం, పాదచారులకు సురక్షితమైన, ప్రత్యేక ఫుట్పాత్ లేకపోవడం పాదచారులకు సురక్షితమైన, ప్రత్యేక ఫుట్పాత్ లేకపోవడం సమస్యగా మారిందని వివరించారు. దాంతో ప్రజలకు అసౌకర్యంగా ఉండటంతో పాటు తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఇటీవల రహదారి విస్తరణలో భాగంగా రహదారిపై ఉన్న ఆక్రమణలను తొలగించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ పరిధిలో జాతీయ రహదారి -67 పై లోబ్ బేరింగ్ పేవర్ బ్లాక్ల నిర్మాణ పనులను చేపట్టాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్రెడ్డి విజ్ఞప్తి చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన సంతోష్కుమార్.. తప్పకుండా వినతులను పరిశీలించి బుచ్చిలో ట్రాఫిక్ నియంత్రణకు లోడ్ బేరింగ్ పేపర్ బ్లాక్స్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## పెంచలయ్య కుమారుల విద్యాబాధ్యతను చేపట్టిన కోటంరెడ్డి హైందవి, వైష్ణవి



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 3, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని ఆర్డీటీ కాలనీలో గంజాయి రౌడీల చేతిలో హత్యకు గురైన పెంచలయ్య కుటుంబాన్ని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్రెడ్డి బుధవారం సీపీఎం నాయకులతో కలిసి పరామర్శించారు. కుటుంబానికి అండగా నిలుస్తానని భరోసా ఇస్తూ వారికి సొంతంగా 10 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. పెంచలయ్య కుమారులు తమతండ్రి కోరిక మేరకు ఐఏఎస్, ఐపీఎస్ అవ్వాలని లక్ష్యముందని తెలిపిన నేపథ్యంలో వారి విద్యాబాధ్యతను ఎమ్మెల్యే కుమార్తెలు కోటంరెడ్డి హైందవి, వైష్ణవి స్వీకరించారు. ఈ ఇద్దరి చదువు బాధ్యతను పూర్తి స్థాయిలో తీసుకుంటామని వారు ఫోన్లో మాట ఇచ్చారు. ఇప్పటికే మైథిలి స్కూల్ యాజమాన్యం ఇద్దరు బాలురకు 10వ తరగతి వరకు ఉచిత విద్యను ప్రకటించగా ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. ఆర్డీటీ కాలనీలో కనీస వసతులు మెరుగుపరిచేందుకు వారంలో 50 లక్షల రూపాయల నిధులు మంజూరు చేస్తామని ప్రకటించిన శ్రీధర్రెడ్డి, గంజాయి వ్యతిరేకంగా పోరాడిన పెంచలయ్య స్ఫూర్తిగా నిలిచేందుకు కాలనీలో విగ్రహం ఏర్పాటు చేస్తామని తెలిపారు. హంతకులకు కఠిన శిక్షలు పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. రాష్ట్రంలో గంజాయి మూకలపై ఉక్కుపాదం మోపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కి ప్రజలు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. పెంచలయ్య కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలిచిన ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులకు సీపీఎం నేత, మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## రెడ్ క్రాస్ ను సందర్శించిన దీపా వెంకట్



**నెల్లూరు డిసెంబర్ 3 ప్రభాతవార్త వైద్యం** :స్వర్ణ భారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ , సామాజిక కార్యకర్త అయిన ఐ దీపా వెంకట్ బుధవారం నెల్లూరులోని ఇం డియన్ రెడ్‌క్రాస్‌ను సందర్శించారు. మొదటిగా ఎమ్మెస్సార్ స్పాస్టిక్ సెంటర్‌ను సందర్శించి, ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులతో సరదాగా మాట్లాడారు. చిన్నారులకు నిర్వహించే ప్రత్యేక విద్య గురించి వివిధ రకాల థెరపీల గురించి అడిగి తెలుసు కున్నారు. రెడ్ క్రాస్‌లో తల సేమియా వ్యాధి సోకిన పిల్లల కు పూర్తి ఉచితంగా రక్త మార్పిడి జరుగుతున్న విధానం తెలుసుకొని తమ అభినందనలు తెలిపారు. బ్లడ్ సెంటర్ ను సందర్శించి రెడ్ క్రాస్ చేస్తున్న సేవ లను కొనియాడారు . భవిష్యత్తులో రెడ్‌క్రాస్‌కు తన వం తు సహాయ సహకారాలను అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ వాకాటి విజ య్ కుమార్ రెడ్డి , వైస్ చైర్మన్ చెమర్తి జనార్దన రాజు, తల సేమియా ప్రాజెక్టు కన్వీనర్ డాక్టర్ సీత, రెడ్ క్రాస్ కోశాధికారి సురేష్ కుమార్ జైన్, మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్ , కలికి శ్రీహరి రెడ్డి, యాలమూరి రంగయ్యనాయుడు, షేక్ పర్వీన్, డాక్టర్ హరిత , డాక్టర్ యశోవర్ధన్, హెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు డిసెంబర్ 3 ప్రభాతవార్త** కోవూ రులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవ స్థానంలో మార్గశిరమాసం బుధవారం ప ర్వదిన సందర్భంగా ఆలయంలో పల్లకి సేవ కా ర్యక్రమాలను కన్నుల పండుగ నిర్వహించారు ఈ సంద ర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు నాగ రాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పూజ నిర్వహించి అనంతరం పల్లకి సేవ కార్యక్రమాన్ని కొనసాగించారు. అనంతరం ప్రసాద వితరణ కా ర్యక్రమాన్ని చేపట్టారు ఈ కార్యక్రమంలో రుత్వికులు శ్రీకాంతాచార్యులు కృష్ణమాచార్యులు సుబ్బయ్య స్వామి నందకుమార్ స్వామి ఫణీంద్ర స్వామి భక్తులు ఉన్నారు.

## వైభవంగా దీపోత్సవం



**కోవూరు డిసెంబర్ 3 ప్రభాతవార్త** కోవూరు లోవెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో మార్గశిర బుధవారం పర్వదిన సం దర్భంగా వేకువ జామునే స్వామివారికి ఆల య ప్రధాన అర్చకులు నాగరాజా చార్యులు ఆధ్వ ర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయ పద్ధం గా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు అనంతరం నాగ వల్లి పత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భాన్ని పురస్కరించుకొని దీపోత్స వ కార్యక్రమాన్ని కనుల పండుగ చేపట్టారు ఈ కార్యక్రమంలో చిటపక్కల ప్రాంతం నుంచి మహిళా భక్తులు పాల్గొని దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు

## కోనమ్మ తోటలో వర్షంతో అవస్థలు

**సైడ్ కాలువ లేక ఇబ్బందులు.**



**కోవూరు డిసెంబర్ 3 ప్రభాతవార్త.** గతంలో కురిసిన భారీ వర్షాలు. పెన్నాదికి పడిన గండి కారణంగా. కోనమ్మ తోట ప్రాంత ప్రజలు తీవ్రస్థాయిలో అవస్థలు పడి వారం రోజులపాటు నీటిలోనే మగ్గాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఎన్నో అవస్థలు గురై విషయాన్ని అప్పట్లో ఉన్న శాసనసభ్యులు తీసుకువచ్చిన వారు ఏం మాతో స్పందించిన దాఖలాలు లేవు. ప్రస్తుతం కురుస్తున్న ఈ వర్షాలకు కోనమ్మ తోట ప్రాంతంలో సైడ్ కాలువ లేక నిరంత రోడ్డుపైన ప్రవహించి పాఠశాలకు వెళ్లే విద్యార్థులు తీవ్రస్థాయిలో ఇబ్బందులు పడాల్సి నదుస్థితి ఏర్పడింది ఇప్పటికైనా సంబంధిత ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో సైడ్ కాలువలుఏర్పాటు చేయవలసిందిగా ఈ ప్రాంత ప్రజలు ముక్తికంఠంతో కోరుతున్నారు

## వైభవంగా అయ్యప్పల ఇరుముడి కార్యక్రమం



**కోవూరు డిసెంబర్ 3 ప్రభాతవార్త** కోవూరు లోనిజా తీయ రహదారు లో వెలసి ఉన్న శ్రీ షిరిడి సాయి మందిరంలో బుధవారం ప్రాతకాలమునే స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు జగదీష్ స్వామి ఆధ్వ ర్యంలో పూజలను ప్రత్యేకంగా నిర్వహించారు అనం తరం గురుస్వామి శేఖర్ స్వామి ఆధ్వ ర్యంలో అయ్యప్పలకు సాంప్రదాయ బద్ధంగా భక్తిశ్రద్ధలతో ఇరుముడి కార్యక్రమాలను అత్యంతవైభవంగా చేపట్టారు ఆలయ ప్రాంగణం అయ్యప్పల శరణు ఘోషల మధ్య ప్రతి ధ్వనించిందఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు

## ఆత్మ రక్షణ కోసం విద్యార్థులకు కరాటే శిక్షణ అవసరం



**కోవూరు డిసెంబర్ 3 ప్రభాతవార్త** ప్రాథమిక దశ నుంచి ఆత్మరక్షణ కోసం విద్యార్థినిలు కరాటే వంటి క్రీడల పట్ల ప్రత్యేక దృశ్య సారిస్తే వారికి అది ఎంతో ఉపయోగపడుతుందని కరాటే శిక్షకులు రాజేష్ తెలిపారు కోవూరు లోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నతపాఠశాల సమావేశ మందిరంలో బుధవారం విద్యార్థినులకు కరాటే పై శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈ కరాటేశిక్షణను విద్యార్థులకు అందిస్తున్నామన్నారు దీనిని వారు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు పి.సులోచన. సునీత తదితరులు ఉన్నారు

## నూతన సాంకేతిక పద్ధతులను రైతులు అందిపుచ్చుకోవాలి



**కోవూరు డిసెంబర్ 3 ప్రభాతవార్త** వ్యవసాయ పశు సంవర్ధక శాఖ మత్స్యశాఖ ఉద్యానవన శాఖ లలో వస్తున్న నూతన మార్పులపై రైతులు పూర్తిస్థాయిలోఅందిపుచ్చుకోవాలని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్‌నాయక్ తెలిపారు కోవూరు మండలం చెర్లపాలెం గ్రామ పం చాయతీలోని రైతు సేవా కేంద్రంలో బుధవారం రైతన్న మీకోసం వర్క్ షాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో పశుసంవర్ధకశాఖలో అనేక పథకాలు రావడం జరిగిందని వాటిని పాడి రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జి అనిత మాట్లాడుతూ రైతులు వ్యవసాయక శాఖలో వస్తున్న నూతన అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాలన్నారు సాగు ఖర్చులు గణనీయంగా తగ్గించి దిగుబడి పెంచేలా చొరవ చూపాలన్నారు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించి యూరియా పురుగు మందుల వాడకాన్ని గణనీయంగా తగ్గించాలన్నారు భూసార ఫలితాలు ఆధారంగానే రైతులు ఎరువులు వాడుకోవాలన్నారు తక్కువ పెట్టుబడులతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించేలా రైతులు చొరవ చూపాలన్నారు ఇంకా ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ మధుసూదన్ డాక్టర్ వరి సస్యరక్షణ యాజమాన్యపద్ధతులపై అవగాహన కల్పించారు సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తూర్పుగోదావరి జిల్లా నెలిచర్ల మండలంలో పాల్గొన్న కార్యక్రమాన్ని లైవ్ ద్వారా రైతులకు వీక్షించేలా చొరవ తీసుకున్నారు వ్యవసాయ అనుబంధ శాఖల మండలఅధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా హనుమత్ వ్రతం



**కోవూరు డిసెంబర్ 3 ప్రభాతవార్త** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజ నేయ స్వామి వారి దేవస్థానంలో మా ర్గశిర మాస బుధవారం పర్వదినం సందర్భంగా స్వామివారికి హనుమ త్ వ్రత కార్యక్రమాన్ని సాంప్రదాయ బ ద్ధంగా అత్యంత భక్తిశ్రద్ధలతో వైభ వంగా నిర్వహించారు. రిత్వికులు శ్రీకాంతాచార్యులు హనుమత్ వ్రత కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతోనిర్వహించుకుంటే దోషాలు పోవడమే కాకుండా శుభాలు కలు గుతాయని ఈ సందర్భంగా భక్తులకు వివరించారు వ్రతాన్ని ఆచరించే పద్ధతిని భక్తులకు పూర్తి స్థాయిలో వివరించారుఅనంతరం హనుమత్ గాయత్రిహోమ కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యులు కృష్ణమాచార్యులు సుబ్బయ్య స్వామి నందకిషోర్ స్వామి ఫణీంద్ర స్వామి భక్తులు ఉన్నారు

## మెప్మా కార్యాలయంలో విభిన్న ప్రతిబావంతుల దినోత్సవం



**కావలి,డిసెంబర్ 3 ప్రభాతవార్త :** మున్సిపాలిటి నందు కమీషనర్ జి.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో మెప్మా సిఆర్‌సి కార్యాలయంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వంచే అందాల్సిన పథకాలు అందేలా చూస్తానని తెలిపారు. మున్సిపల్ మేనేజర్ పణికుమార్ మాట్లాడుతూ సకలాంగుల కన్నా విభిన్న ప్రతిభావంతుల్లో తెలియని మేధాశక్తి ఉందని ఎలాంటి పనినైనా తెలివిగా, చురుకుగా చేస్తారని చెప్పారు. స్వయం సహాయక సంఘాలచే పిఎం స్వానిధి పథకంద్వారా 10,65,000రుపాయల చెక్కును అందజేశారు. అనంతరం కేక్‌కట్‌చేసి స్వీట్లు తినిపించుకొన్నారు. మెప్మా సిబ్బంది సునితను సన్మానించారు. ప్రతిభావంతులకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో మెప్మా సిబ్బంది సిఎంఎం భారతి, సిఓలు కొండయ్య, విజయప్రతాప్, అరుణకుమార్, ప్రసన్న, సునీత, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫించన్ సొమ్ముతో పరారైన సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్



**దగదర్తి, డిసెంబర్ 3, ప్రభాతవార్త** పింఛన్ దారులకు పంపిణీ చేయాల్సిన సొమ్మును లబ్దిదారులకు పంపిణీ చేయకుండా పరారయ్యా డు ఓ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంటు. ఈ సంఘటన మండలం లోని చెన్నూరు గ్రామ సచివాలయం పరిధిలో జరిగింది. చెన్నూరు గ్రామ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంటుగా పని చేస్తున్న గరికపాటి శ్రీనివాసులు 14,17 క్లస్టర్లకు సంబంధించి ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పథకంలోని లబ్దిదారులకు పంపిణీ చేయడానికి రూ.3,32,500 మొత్తాన్ని స్వీకరించాడు. అయితే నిందితుడు ఆ మొత్తాన్ని లబ్దిదారులకు పంపిణీ చేయకుండా ప్రభుత్వ డబ్బుతో పరారయ్యాడు. దగదర్తి మండల ఎంపీడీవో వెంకటేశ్వర్లు పెన్షన్లు పంపిణీ కానీ విషయమంను గమనించి, నిందితుడిని సంప్రదించడానికి ప్రయత్నించినా, అతను అందుబాటులో లేకపోవడం, అతని ఫోన్ కూడా స్విచ్ ఆఫ్‌లో ఉందని తెలియజేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## దివ్యాంగులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



**కావలి,డిసెంబర్ 3 ప్రభాతవార్త :** విభిన్న ప్రతిభావంతులు చట్టాలపై అవగాహన కలిగి ఉండి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల లీగల్ ఎయిడ్ మెంబర్ సాయిప్రసాద్, లోక్ అదాలత్ సభ్యుల మాలకొండరెడ్డిలు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని మునుమూరు దివ్యాంగుల కాలనీలో దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మెన్ గీతవాణి ఆదేశాల మేరకు కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సాయిప్రసాద్, మాలకొండరెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులు నాలుగు శాతం రిజర్వేషన్ ఉపయోగించుకొని ఉద్యోగాలు పొందాలన్నారు. అనంతరం దివ్యాంగులకు పండ్లు, బిస్కెట్స్ పంపిణీ చేశారు. వికలాంగులు, వృద్ధులు, మా సంస్థచే న్యాయసాయం ఉచితంగా పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల కాలనీ అధ్యక్షులు మండల వెంకటరావు, దివ్యాంగులు పాల్గొన్నారు.

## నెల్లూరులో ఏఐసీసీ పరిశీలకుని పర్యటన



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 3, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లాలో ఆరు రోజుల పాటు పర్యటిం చిన ఏఐసీసీ పరిశీలకులు, తమిళనాడు ఎమ్మెల్యే హాసన్ మౌలానా, డీసీసీ అధ్యక్షుని పదవి ఎంపికపై అన్ని నియోజకవర్గాల్లో విస్తృతంగా అభిప్రాయా లను సేకరించారు. అధ్యక్ష పదవికి అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి అప్లికేషన్లు స్వీకరించడంతో పాటు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తలారి బాల సుధాకర్ మాట్లాడుతూ డీసీసీ ఎన్నికల్లో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ, పరిశీలకుడు పూర్తి స్థాయిలో పర్యటించారని చెప్పారు. రాబోయే రోజుల్లో గ్రామ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి అధిష్టానం ప్రత్యేక చర్యలు తీసుకోనుందని తెలిపారు. పీసీసీ బృందంతో పాటు జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తుఫాన్ తో ముంపుకు గురైన నారుమళ్ళు

## 5 వేల ఎకరాల్లో కోటి రూపాయాల మేర నష్టం



**మనుబోలు డిసెంబర్ 3 ప్రభాతవార్త :** దిత్వా తుపాన్ వల్ల కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో వరి నాట్లు వరి నారుమళ్ళు మునిగిపోయి రైతన్నకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. మంగళవారం రాత్రి నుండి ఎడతెరప లేకుండా కురుస్తున్న బారీ వర్షాలతో మండలంలోని వెంకటన్నపాళెం మనుబోలు, ఎల్.ఎన్.పురం, కాగితాలపూర్, పిడూరు, గురివిందపూడి, వెంకటాచలం మండలంలోని ఇడిమేపల్లి గ్రామాలలో సుమారు 5000 ఎకరాలలో వరి నారుమళ్ళు వేసి ఉన్నారు. వరదనీరు పొల్లాలో ప్రవహించడంతో నారుమళ్ళు పనికిరాకుండా పోయాయి. దీనితో కోటి రూపాయాలు మేర రైతులకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

## ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



**లింగసముద్రం, డిసెంబర్ 3, ప్రభాతవార్త :** ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన లింగసముద్రంలోని భవిత కేంద్రంలో ఐఆర్టీలు సుప్రియ, శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా లింగసముద్రం ఎంఈఓలు కనపర్తి మాల్యాద్రి, ఎంపీ శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ కోసం భవిత కేంద్రాల ద్వారా తగిన విద్యాభ్యాసం అందజేస్తున్నారని తెలిపారు. దివ్యాంగ విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాధమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు సుధాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## రైతును రాజుగా చేయడమే సిఎం లక్ష్యం



**విడవలూరు, డిసెంబర్ 3 ప్రభాతవార్త :**మండల కేంద్రంలో ఉన్న రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతన్న మీకోసం వర్క్‌షాపు సంబంధించి రాష్ట్ర ముఖ్యమంత్రి లైవ్ టెలికాస్ట్‌లో రైతులను ఉద్దేశించి మాట్లాడడంతో మండల రైతులు వీక్షించారు. ఈసందర్భంగా ఈస్టర్న్ చానల్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ ఛైర్మెన్ పాశం శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ సిఎం రైతుని రాజుగా చేయాలన్న ముఖ్య ఉద్దేశ్యంతోనే గ్రామస్థయి నుంచి కార్యాచరణ ప్రణాళిక తయారుచేసి పంపాల్సిందిగా తెలిపారన్నారు. ఎంఈఓ మాట్లాడూ రైతన్న మీ కోసం ముఖ్య విదానాలు నీటి భద్రత, ఆధారితీ పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్ మద్దతు మొదలైన వాటిపై అవగాహన కల్పించారు. వ్యవసాయం ట్రైన్ బావాజన్ వ్యవసాయంలోని ఉపయోగాలు తెలిపారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తిచూపాలని కోరారు. ఈకార్యక్రమంలో సొసైటి ఛైర్మెన్ పురందర్‌రెడ్డి, వావిళ్ళ నీటిసంఘం అధ్యక్షులు బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, విఏఏ విష్ణుప్రియ, సుభాషిని, విఎస్ఎ సహస్, డిఆర్‌డిఏ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతన్న మీకోసం పథకాలపై అవగాహన

**కొడవలూరు, డిసెంబర్ 3 ప్రభాతవార్త :**మండలంలోని బొడ్డువారిపాలెం గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమం రైతు సేవా కేంద్రం మండల వ్యవసాయ అధికారిన విజయలక్ష్మి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే పథకాలను రైతులకు వివరించి తెలిపారు. నీటి భద్రత, ఆదారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్‌ప్రాసెసింగ్ ప్రభుత్వం నుంచి మద్దతు మొదలైన ఐదు విధానాల గురించి వివరించారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై కూడా ఆసక్తి చూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఏఏ సుజాత, ఎఫ్‌పిఓ సిసిరవికుమార్, వెటర్నరీ అసిస్టెంట్ రమణయ్య, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది రాణి, రామ్‌ప్రసాద్, శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

## ఎడతెరిపి లేని వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తం

**ముంపుకు గురైన నెల్లూరు నగరం**

**జాతీయ రహదారితోపాటు ప్రధాన రహదారులన్నీ మునక**

**పలు కాలనీల్లో వరద నీరు చేరి ఇబ్బందులు పడ్డ ప్రజలు**



**నెల్లూరు డిసెంబర్ 3 ప్రభాతవార్త వైద్యం** దిత్వా తుఫాన్ నెల్లూరును నిండా ముంచింది . తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు నెల్లూరు నగరం తడిసి ముద్దయింది . బుధవారం నెల్లూరును వరద నీరు చుట్టు ముట్టింది . పలు కాలనీలు నీట మునిగాయి. తుఫాను తీరందాటింది తమిళ నాడులోనైనా నెల్లూరులో వరద బీభత్సం కొనసాగింది . వెంకటాచలం నుంచి పెన్నా బ్రిడ్జి వరకు , నేషనల్ హైవే తో పాటు నెల్లూరులోని ప్రధాన రహదారులన్నీ వరద నీటిలో చిక్కుకున్నాయి . నాలుగు రోజులపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో నెల్లూరులో జనజీవనం స్తంభించింది . నిత్యావసర వస్తువులకు సైతం గడప దాటి కాలు బయట పెట్టలేని పరిస్థితులు నెలకొన్నాయి . వాయుగుండం తీరం దాటే సమయంలో నెల్లూరు జిల్లాలో గాలుల ప్రభావం లేకపోవడంతో ప్రజలు కొంతవరకు ఊపిరి పీల్చుకున్నారు . తల్పగిరి కాలనీ ముంపుకు గురి కావడంతో ఆ నీరంతా వేదయపాలెంలో ప్రధాన రహదారిపై చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంకటాచలం నుంచి వేదాయపాలెం సెంటర్ వరకు నేషనల్ హైవే నిండా వరద నీరు చేరింది. దీంతో గంటల కొలది ట్రాఫిక్ జామై వాహనాలు ముందుకు కదలలేని పరిస్థితులు నెలకొన్నాయి . అక్కడక్కడ కొన్ని వాహనాలు మరమ్మతులకు గురి కావడంతో వా హన రాకపోకలు ఆగిపోయాయి . ఆత్మకూరు బస్టాండు, విఆర్సి, మాగుంట లేఔట్ తదితర అండర్ బ్రిడ్జిల నిండా నీరు చేరినా, ముందస్తు ప్రణాళికలతో మోటార్లతో నీటిని తోడి వేయడంతో వాహనాల రాక పోకలు కొనసాగాయి . మాగుంట లేఔట్ ప్రధాన రహదారిపై మోకాలిలోతు నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. మినీ బైపాస్ కూడా వరద నీటిలో చిక్కుకొని ప్రజలు, వాహనదారులు అవస్థలు పడ్డారు. ఏది ఏమైనా నెల్లూరు నగరం గుండా ప్రవహించే పంట కాలువలు కొంత భాగం ఆక్రమణకు గురికావడం, మరి కొంత భాగలో కాలువల వైశాల్యాన్ని తగ్గించడంతో ముంపు అనివార్య మవుతుంది.



## వ్యవసాయంలో ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలి





**ఇందుకూరుపేట, డిసెంబర్ 3, ప్రభాతవార్త :** మారిన పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయంలో ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు సారధ్యంలో వ్యవసాయంలో పండుగ వాతావరణం నెలకొందని ఆమె పేర్కొన్నారు. బుధవారం ఇందుకూరుపేట మండలం జగదేవిపేటలోని రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన రైతన్న మీ కోసం కార్యక్రమంలో పాల్గొన్న ఆమె కూటమి ప్రభుత్వ వ్యవసాయ సంక్షేమ విధానాలను రైతులకు వివరించారు. భారీ వర్షాల నేపధ్యం.. గ్రామానికి చేరుకున్న ప్రశాంతమ్మకు కూటమి నాయకులు, రైతులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన ఉద్యాన పంటలు, ఆక్వా సాగును పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడి సాగు వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మాట్లాడుతూ చిన్న, సన్న కారు రైతుల కోసమే యూరియా కార్డుల విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఆధునిక పద్ధతుల ద్వారా వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించాలని ఆమె రైతులకు సూచించారు. డిమాండ్ ఉన్న పంటలను పండించాలని ఆమె రైతులను కోరారు. ప్రజల అవసరాలను గుర్తించి సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ఆమె ధన్యవాదాలు తెలిపారు. రైతులకు ఇప్పటికే రెండు విడతలు యూరియా పంపిణీ చేశామని త్వరలో మరో విడత పంపిణీ చేస్తామన్నారు. రైతుల సాధక బాధతలు ప్రత్యక్షంగా తెలుసుకోవడమే రైతన్న మీ కోసం కార్యక్రమ లక్ష్యమన్నారు. సీఎం చంద్రబాబునాయుడు సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యతను ఇస్తున్నారని చెప్పారు. బుచ్చిరెడ్డిపాలెంలో జాతీయ రహదారి విస్తరణకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ చైర్మన్‌ను కలిశారని, 8 కోట్లతో రహదారి విస్తరణ జరగనుందని ఆమె స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎంపీకి ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. సూపర్ సిక్స్, సూపర్ హిట్ చేశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేశారన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ ఇంకా ఎవరికైనా అన్నదాత సుఖీభవ అందకుంటే సచివాలయంలో వివరాలు నమోదు చేయాలని సూచించారు. ప్రస్తుతం చదువుకున్న వారు వ్యవసాయంలో రాణిస్తున్నారని చెప్పారు. సజ్జ, జొనన రాగులు వంటి పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. మత్స్యకారుల సేవలో పథకం కింద వేట నిషేధ సమయంలో ఇచ్చే భృతిని 20 వేలు చేశారన్నారు. తల్లికి వందనం కిం దెంత మంది విద్యార్థులున్నా.. అందరికి పథకం అమలు చేశారన్నారు. కోవూరు నియోజకవర్గాన్ని గంజాయి రహితంగా తీర్చిదిద్దే క్రమంలో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. పోలీసులకు ఇప్పటికే తగిన ఆదేశాలు జారీ చేశామని, స్కూళ్లు, కాలేజీల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. గంజాయి నియంత్రణలో పౌరులు కూడా భాగస్వాములు కావాలన్నారు. ఇందులో మీడియా ప్రతినిధులు కూడా నిత్యం అప్రమత్తంగా ఉండి, ఎక్కడ ఏం జరుగుతుందో పరిశీలించాలన్నారు. అందరి సహకారంతోనే గంజాయిని నియంత్రించగలమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు రఘునాథరెడ్డి, అనురాధమ్మ, తహసీల్దార్ మురళి, ఎంపీడీవో నాగేంద్ర, టీడీపీ సీనియర్ నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రావెళ్ల వీరేంద్ర నాయుడు, ఇందుకూరుపేట టీడీపీ అధ్యక్షుడు ఏకొల్లు పవన్ కుమార్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు చెంచు కిషోర్ యాదవ్, పీఎల్ ఆవు, మండల టీడీపీ ఉపాధ్యక్షులు కూకటి వెంకటేశ్వర్లు రెడ్డి, ఇందుకూరుపేట సహకార సంఘ అధ్యక్షులు గండవరపు అమర్‌నాథ్‌రెడ్డి, సాగునీటి సంఘ అధ్యక్షులు దేవిరెడ్డి రవీంద్రరెడ్డి, స్థానిక నాయకులు కుదురు రామకృష్ణారెడ్డి, బొల్లినేని రావి నాయుడు, బొల్లినేని హరినాయుడు, మల్లిఖార్జున నాయుడు, అవ్వరు ఏడుకొండలు, మారుబోయిన జనార్ధన్ గౌడ్, లతో పాటు బీజేపీ, జనసేన నాయకులు, టీడీపీ యూనిట, క్లస్టర్ బూత్ కమిటీ కన్వీనర్లు పాల్గొన్నారు.

## వవ్వేరు గ్రామంలో రైతన్న మీకోసం ముగింపు



**బుచ్చి డిసెంబర్ 3 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని వవ్వేరు గ్రామంలో నిర్వహించిన రైతన్న మీకోసం ముగింపు కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పి.సత్యవాణి పాల్గొని రైతలకు యూరియా కొరకు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. అవసరం మేరకు సహకార సంఘాలు రైతు సేవా కేంద్రాలు మరియు ప్రవేటు డీలర్ల ద్వారా సకాలంలో పంపిణి చేస్తామని భరోసా ఇచ్చారు. రైతుల కోరిక మేరకు సరఫరాను అనుసరించి 4వ విడత కూడా యూరియా పంపిణి చేసేందుకు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు నర్సోజిరావు, బుచ్చి మండల వ్యవసాయాధికారి ఎన్.శ్రీహరి, ఇసుకపాళెం పశువైద్యాధికారి ఏఈఒ ఎస్.ఇందు, రైతులు పాల్గొన్నారు.

## ఉదృతంగా ప్రవహిస్తున్న పొట్టేళ్ళ వాగు

## ఐదుగ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు



**మనుబోలు డిసెంబర్ 3 ప్రభాతవార్త :** దిత్వా తుపాన్ వల్ల కురుస్తున్న భారీ వర్షాలకు బుధవారం మండలంలోని కొమ్మలపూడి రైల్వేవంతెనవద్ద ఉన్న పొట్టేళ్ళ కాలువ ఉదృతంగా ప్రవహిస్తుంది. కొమ్మలపూడి, ముద్దుమూడి ,చెరుకుమూడి,వెంకటాచల మండలంలోని కసుమూరు, కురిచర్లపాడు, తదితర గ్రామాలకు ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తారు. ఈ మార్గం మూసుకపోవడంతో చుట్టు తిరుక్కొని కొమ్మలపూడి గ్రామానికి వెళ్ళాలసి వస్తుందని అదనంగా 5 కిలోమీటర్లు పైగా పెరుగుతుందని వాహనదారులు వాపోతున్నారు. కొమ్మలపూడి వద్ద ఫ్లైఓవర్ నిర్మించి రాకపోకలు సాగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## రైతు శ్రేయస్సు ప్రభుత్వ లక్ష్యం

**వింజమూరు, డిసెంబర్ 3, ప్రభాతవార్త :** రాష్ట్రంలో రైతులు పండించే ప్రతి గింజ ప్రతి పంట రైతుకు గిట్టుబాటు కల్పించాలని ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం పని చేస్తుందని సొసైటీ చైర్మన్ వెంకటేశ్వర్లు యాదవ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మండలంలోని గుండెమడగల గ్రామంలో రైతన్న మీ కోసం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రైతును రారాజు చేసేందుకు అనేక సంస్కరణలను చేపట్టారన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ ఏవో వాసు మాట్లాడుతూ నీటి భద్రత డిమాండ్ ఆధారిత పంటలు అగ్రిటెక్ ఫుడ్ ప్రాసెసింగ్ గిట్టుబాటు ధర పాడి రైతుకు అండ తదితర కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వం వ్యవసాయ ఉద్యాన పశుసంవర్ధక మత్స్యకార రంగాలలో 35శాతం ప్రభుత్వం వాటా అందిస్తుందని ఈ రంగాలను పరిపుష్టం చేయడం కోసం స్వర్ణాంధ్ర 247కి అనుగుణంగా సమాజంలో నేడు మారుతున్న ఆహారపు అలవాటులకు అనుగుణంగా అన్నదాతలు సాగు పద్ధతులు మార్చుకోవాలని పంట మార్పిడి పాటించాలన్నారు. చిరుధాన్యాలైన రాగులు సజ్జలు, కొర్రలు వాటికి ప్రస్తుతం డిమాండ్ ఉందని అలాంటి పంటలపై రైతులు దృష్టి సారించాలన్నారు. ప్రకృతిలో వచ్చే వాతావరణ మార్పులను తట్టుకునే పరిష్కార మార్గంగా ప్రకృతి వ్యవసాయం పెద్ద ఎత్తున రైతులు చేపట్టాలన్నారు. రాష్ట్రంలోని ప్రతి రైతుకు ఏపీ ఫార్మర్ రిజిస్టర్ పథకంలో యూనిక్ ఐడీల నమోదుతో ప్రభుత్వ పథకాలు వర్తింపచేయడం జరుగుతుందన్నారు. డిప్‌లు, స్ప్రింక్లర్ల సేద్యాన్ని విస్తరించి నీటి వినియోగ సామర్థ్యాన్ని 50 శాతం వరకు పెంచి రైతు ఉత్పాదకతను పెంచడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు బిందు సేద్యంపై నూరుశాతం రాయితీని అందించడం జరుగుతుందన్నారు. రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద ఒక్కొక్కరికి 14 వేల వంతున సుమారు 46 లక్షల 86 వుల 838 రైతు కుటుంబాలకు అందించిందన్నారు. ఉపశమనం పంట బీమాను అందించి రైతు పక్షపాతి ప్రభుత్వంగా పాలన కొనసాగిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ వైద్యాధికారి కొమ్మి కోటేశ్వరరావు, నాయకులు కర్ణం శ్రీనివాసన్ నాయుడు, సీహెచ్ వెంకటేశ్వర్లు, రైతులు తదితరులు ఉన్నారు.



## చిద్రమైన రహదారికి మోక్షం కలిగేనా..?

**వింజమూరు, డిసెంబర్ 3, ప్రభాతవార్త :** వింజమూరు నడిమూరు నందు దేవతా మహల్ సెంటర్ నుండి శ్రీ సరస్వతి హైస్కూల్ మీదుగా హైవే రోడ్డుకు వెళ్లే రహదారి బురదమయమై ప్రయాణి ంచ డానికి బాధాకరంగా మారింది. ఇటీవల కురుస్తున్న దిత్వా తుఫాన్ వర్షాలకు మరింత గుంతలమయమై నీరు నిల్వ చేసి ఎక్కడ గుంట ఉందో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. వాహన దారులు ప్రయాణించడానికి తీవ్ర అసౌకర్యంగా ఏర్పడింది. ఈ విషయాన్ని ఎంపీడీవో పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా బుధవారం ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి పంచాయతీ రాజ్ శాఖ ఏఈ తిరుమలయ్యతో కలిసి పంచాయతీ ఈవో కే.రామారావు సర్పంచ్ ఎన్.సుజనా, వార్డు మెంబర్ గురవారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ఈ.శ్రీనివాస్ రెడ్డి రహదారి పూర్తిగా చిత్రమైందని వీలైనంత త్వరగా రహదారి మార్గం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే ఈ మార్గం గుండా అనేక మంది రైతులు పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఎంతో మంది ఉన్నారని వారందరికి సౌకర్యవంతంగా ఉండేందుకు త్వరలో ఈ మార్గాన్ని సౌకర్యవంతం చేస్తామన్నారు. అందుకే పీఆర్ఏఈ పరిస్థితిని గమనించి ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరలో మంజూరయ్యే విధంగా కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మార్గం మొత్తం 750 మీటర్లు ఉందని ఎంత వరకు ఇబ్బందికరంగా ఉందో గుర్తించి అంతమేరా రహదారిని వేయడమా లేదా పూర్తిగా వేయడం అనేది పరిశీలించి చేస్తామన్నారు. ముఖ్యంగా ఈ మార్గం గుండా అధిక సంఖ్యలో విద్యార్థులు పాఠశాలకు వస్తుంటారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులు చిన్న వయసు గనుక ఇబ్బందులు పడుతూ ఉన్నారు. వీటన్నింటిని గమనించి త్వరలో రహదారి మార్గాన్ని సౌకర్యవంతం చేయాలని ఈ ప్రాంత వాసులు రైతన్నలు కోరుకుంటున్నారు.



## రైతులకు ఉచిత విత్తనాలు ఇవ్వాలి : సిపిఎం డిమాండ్

**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 3, ప్రభాతవార్త:** దిత్వా తుఫాను కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో నారు మడులు నీటమునిగిపోవడంతో నారులు పూర్తిగా కుళ్లిపోయాయి. రైతులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు తక్షణమే ప్రభావిత గ్రామాల్లో పర్యటించాలని సిపిఎం రైతు సంఘం మండల కార్యదర్శి చింతా రామసుబ్బయ్య డిమాండ్ చేశారు. నష్టపోయిన నారుమడుల స్థానంలో రైతులు మళ్లీ నారు వేయాల్సి ఉండడంతో ప్రభుత్వం వెంటనే ఉచిత విత్తనాలను అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ పరిశీలనలో మండల రైతు సంఘ సిపిఎం నేతల పాల్గొన్నారు.



## బైరి నరేష్ అరెస్టు అక్రమం

**నెల్లూరు,డిసెంబరు3 ప్రభాతవార్త-విద్య :** ప్రజల్లో ఉన్న మూడకనమ్మకాలను పారద్రోలేందుకు శ్రమిస్తూ నిత్యం ప్రజల్లో ఉంటున్న మూఢనమ్మకాల నిర్మూలన సంఘం వ్యవస్థాపక, జాతీయ అధ్యక్షులు డాక్టర్ బైరి నరేష్‌ను తెలంగాణాలో పోలీసులు అరెస్టు చేయటం అక్రమని ఎంఎస్ఎస్ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి దమ్ము పద్మశ్రీనాసిక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గద్వాల్‌లో తన స్నేహితుడు ఇంటికి వెళ్లిన బైరి నరేష్‌ను ముందుస్తు సమాచారం లేకుడా తెల్లవారుజామున 5 గంటలకు అరెస్టు చేయటం దారుణమని దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజల కోసం కష్టపడే వారికి సహకరించాల్సిన పోలీసులు ఇలా అరెస్టులు చేయటం మంచి పద్ధతి కాదన్నారు. వెంటనే ఆయనను విడుదల చేయ్యాలని డిమాండ్ చేశారు.

## చేనేత కార్మికులను ఆదుకోండి

**నెల్లూరు అగ్రికల్చర్, డిసెంబర్ 3, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లాలో సంభవిస్తున్న వరుస తుఫాన్‌నులతో చేనేత కార్మికులు అష్ట కష్టాలు ఎదుర్కొంటున్నారు. మగ్గాల గుంతల్లోకి నీరు చేరి, నేత సాగక అవస్థల పాలవుతున్నారు. బట్టలు నేసే కార్మికులే తిండికి బట్టకు అలమటిస్తున్నారు. మొన్న మొంథా తుఫాన్, నేడు దిత్వా తుఫాన్‌తో జిల్లాలో చేనేత కార్మికులు ఉపాధి కోల్పోయి వారి బతుకులు చిన్నాభిన్నమైపోతున్నాయని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పముజుల హరి తెలియజేశారు. నెల్లూరు రూరల్ మండలం సౌత్ మోపూర్ గ్రామంలో దాదాపు 100 కుటుంబాలపైబడి నేత కార్మికులు ఉన్నారు. వీరంతా చేనేత కార్మికులుగానే బతుకులు వెళ్ళదీస్తున్నారు. ప్రస్తుతం కురిసిన భారీవ ర్షాలు వరదలతో మరో మారు మగ్గం గుంతల్లో నీళ్ల చేరాయని, చేనేత కార్మికులను ఆదుకోవాలని పముజుల హరి కోరుతున్నారు. బుధవారం ఆయన సౌత్ మోపూర్ గ్రామంలోని పలువురు కార్మికుల ఇళ్లను సందర్శించి, మగ్గం గుంతల్లో నీటిని పరిశీలించారు. మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న చేనేత కార్మికులకు 70 శాతం కూడా సాయం అందలేదని, అంతే కాకుండా నష్టపోయిన అసలైన కార్మికులను మినహాయించి ఇతరులకు నష్టపరిహారం అందించడం జరుగుతుందని, ఇలాంటివి ప్రభుత్వం పరిశీలించాలని కోరుతున్నారు. ప్రస్తుతం నష్టపోయిన చేనేత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



## ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

**మర్రిపాడు,డిసెంబరు3ప్రభాతవార్త:** ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను మర్రిపాడు మండల విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి నాగేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ దివ్యాంగుల్లో అంతర్గతంగా ఎన్నో దివ్యమైన శక్తులు దాగి ఉంటాయని, వాటిని వెలికి తీయడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. దివ్యాంగ విద్యార్థులకు పలురకాల పోటీలు నిర్వహించి బహు మతులు అందజేశారు.మండల విద్యాశా ఖాధికారులు తిరుపతయ్య, ధనలక్ష్మి, ఫిజియోథెరపి వైద్యులు రఫీ , రిసోర్స్ పర్సన్ రాజేంద్రకుమార్, సహిత విద్య ఉపాధ్యాయులు రషీద్, విజయలక్ష్మి, సిఆర్ఎంటి ఉపా ధ్యాయులు, మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, తల్లిదండ్రులు , దివ్యాంగ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## పేకాట స్థావరం పై పోలీసులు మెరుపు దాడి

**ముత్తుకూరు, డిసెంబర్ 3, ప్రభాతవార్త** ముత్తుకూరు మండలం నేలటూరు గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసుల మెరుపు దాడి చేసారు. ఈ దాడిలో కృష్ణపట్నం సర్కిల్ సీఐ రవి నాయక్, పోర్ట్ ఎస్సై జెపి శ్రీనివాసరెడ్డి, ముత్తుకూరు ఎస్సై ప్రసాద్ రెడ్డి, సిబ్బంది 13 మంది పేకాట రాయుళ్ళు అరెస్ట్ చేసారు. పట్టుబడిన వారి వద్ద నుండి 50,435 రూపాయల నగదు, రెండు కార్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## పెంచలయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని కలెక్టర్‌కు వినతి

**- భారత కమ్యూనిస్టు పార్టీ తరఫున జిల్లా కలెక్టర్‌కు విన్నపం**



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 3, ప్రభాతవార్త :** నెల్లూరు ఆర్‌డిటి కాలనీలో గంజాయి మాఫియా దాడిలో హత్యకు గురైన సిపియం కార్యకర్త, ప్రజా నాట్య మండలి కళాకారుడు కె. పెంచలయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లను బుధవారం ఆయన చాంబర్‌లో సిపిఎం నాయకులతో భార్య, ఇద్దరు కుమారులుజిల్లా కలెక్టర్‌ను కలిశారు గంజాయి, మత్తుపదార్థాల అమ్మ కాలు, వినియోగాలకు వ్యతిరేకంగా నెల్లూరు ఆర్‌డిటి కాలనీలో ప్రజలను చైతన్యపరచి స్థానిక ప్రజలు, పోలీసు అధికారుల సహకారంతో గంజాయి అమ్మకాలు జరుగకుండా చేస్తున్నాడనే కారణంతో ప్రజానాట్యమండలి కళాకారుడు, సిపియం కార్యకర్త కె. పెంచలయ్యపై కక్షగట్టిన గంజాయి మాఫియా కుట్రపన్ని నవంబర్ 28వ తేదీన కత్తులు, గొడ్డళ్ళతో దాడిచేసి అతిధారుణంగా హత్యచేశారని. గంజాయి మాఫియా చేతిలో హత్యగావించబడిన పెంచలయ్య నిరుపేద దళిత (హరిజన) కుటుంబానికి చెందిన వ్యక్తి. ఈయనపై ఆధారపడి భార్య, ఇద్దరు కుమారులు (కుమార్ దేవ్ 9వ తరగతి, నిఖిల్ 5వ తరగతి) వున్నారు. పెంచలయ్య మరణంతో వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. సమాజంలో గంజాయి, మత్తు పదార్థాలు తీవ్రమైన సమస్యగా వున్నాయి. వీటి కారణంగా జరుతున్న నష్టం అంచనా వేయడమే కష్టంగా మారింది. ఈ క్రమంలో గంజాయి, మత్తుపదార్థాల అమ్మకాలు, వాడకానికి వ్యతిరేకంగా ఉద్యమాలు నడుపుతూ యువతను, ప్రజలను చైతన్యం చేసిన పెంచలయ్య లాంటి వ్యక్తి గంజాయి మాఫియా చేతిలో హత్యకు గురైనందున ఆయన కుటుంబానికి ప్రభుత్వం ద్వారా సహాయం ఇప్పించి ఆదుకోవాలని వారు కోర్యారు, ఒక ఉన్నతాశయం కోసం పనిచేసిన పెంచలయ్య కుటుంబానికి రూ. 50 లక్షలు ఎక్స్ గ్రేషియా, పెంచలయ్య సతీమణి దుర్గకి ప్రభుత్వ ఉద్యోగం, కుమారుల చదువులకు ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలని, కుటుంబంలోని ఒక్కొక్కరికి 2 ఎకరాల చొప్పున సాగుభూమి కేటాయించాలని కలెక్టర్‌ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, సిపిఎం స్టేట్ సెక్రటరీ శ్రీనివాసరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా సెక్రెటరీ మాదాల వెంకటేశ్వర్లు, తదితర సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

## రేపు ఏపీఎన్‌జీఓ సంఘం ఎన్నికలు

**వింజమూరు, డిసెంబర్ 3, ప్రభాతవార్త :** ఏపీఎన్జీజీవో అసోసియేషన్ వింజమూరు తాలూకా యూనిట్ నామినేషన్ పక్రియ స్థానిక వింజమూరు ఎంపీడీవో కార్యాలయంలో 5వ తేదీ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయని వింజమూరు తాలూకా ఎన్నికల అధికారి, కావలి తాలూకా అధ్యక్షులు శివ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి నవంబర్ 19వ తేదీన ఎన్నికల నోటీఫికేషన్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం తాలూకా యూనిట్ ఎన్నికలు జరుగుతాయి. ఇందుకు గాను సహాయ ఎన్నికల అధికారిగా కావలి తాలూకా కార్యదర్శి డీవీ నాగరాజుని అలాగే ఎన్నికల పర్యవేక్షణకు జిల్లా ఉపాధ్యక్షులు పి.సతీష్ బాబులను జిల్లా అధ్యక్షులు నియమించారని తెలియజేశారు. కావున వింజమూరు తాలూకా పరిధిలోని ఉద్యోగులందరూ ఈ ఎన్నికలో పాల్గొని ఎన్నికలు విజయవంతం చేయాలని కోరారు.



## రైతన్నా మీకోసం కార్యక్రమం

**పొదలకూరు, డిసెంబర్ 3, ప్రభాతవార్త :** పొదలకూరు మండల పరిధిలోని దేగపూడి గ్రామంలో పొదలకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కె. శివ నాయక్, మండల వ్యవసాయ అధికారి వి.ప్రతాప్ రైతన్నా మీ కోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఏడిఏ మాట్లాడుతూ ప్రభుత్వం నవం బర్ 19వ తేదీన విడుదల చేసిన అన్నదాత సుఖీభవ, ప్రధాన మంత్రి కిసాన్ లబ్ధి పొందిన రైతు కుటుంబాలను కలవడం జరిగినది. అదే విధంగా రైతన్నా మీకోసం కార్యక్రమంకు గాను ప్రతి రైతు సేవ కేంద్రం పరిధిలో గత వారం రోజుల నుండి సేకరి ంచిన రైతుల వివరాలు తెలియజేసి, ఇంకా అన్నదాత సుఖీభవ ప్రధానమంత్రి కిసాన్ నగదు జమని, రైతుల వివరాలు సేకరించి, అర్హులైన రైతుల వివరాలు మరల అప్లోడ్ చేసి పై స్థాయికి పంపుట జరుగుతుందని ఆయన తెలిపారు. అదే విధంగా ముఖ్యమంత్రి సందేశం రైతులకు చదివి వినిపించడం జరుగుతుందన్నారు. గ్రామ సచివాలయం పరిధిలోని అందరూ అధికారులు పాల్గొని, రైతుల వివరాలు సేకరించుట జరుగుతుందని తెలిపారు. అందరూ రైతులు సుస్థిర, సమగ్ర వ్యవసాయ ప్రణాళికల రైతు శిక్షణ కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలి అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, నీటి సంఘం అధ్యక్షుడు భాస్కర్ నాయుడు, మల్లికార్జున నాయుడు మండల పశు వైద్య అధికారి, ఉద్యానవన అధికారి, పొదలకూరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త సురేఖ, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలో 507 హెక్టార్లలో దెబ్బతిన్న వరి నాట్లు

**నెల్లూరు అగ్రికల్చర్, డిసెంబర్ 3, ప్రభాతవార్త :** జిల్లాలో దిత్వా తుఫాన్ కారణంగా సంభవించిన భారీ వర్షాలు వరదలతో వరి నాట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. బుచ్చి, సంగం, కొడవలూరు, కావలి, కోవూరు, బోగోలు, అల్లూరు మండలాల్లో ఈ రబీ సీజన్‌లో నాటిని వరి ప్రాథమిక దశలోనే దెబ్బతింది. బుధవారం జిల్లా వ్యవసాయ శాఖ అందించిన సమాచారం మేరకు 507 హెక్టార్లలో వరినాట్లు దెబ్బతినగా, 116 హెక్టార్లలో ఇతర ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని అధికారులు ఒక ప్రకటనలో తెలియజేశారు. 4 రోజులుగా వర్షాలు తగ్గుముఖం పట్టకపోవడంతో వరి రైతులు ముఖ్యంగా నష్టాల పాలయ్యారు. 29 గ్రామాల్లో 439 మంది రైతులు నష్టాలను చవి చూశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. నాలుగు రోజులు పాటు కురిసిన భారీ వర్షాలకు నారుమళ్లు కూడా పూర్తి దెబ్బతిన్నాయి.



## రైతన్న మీకోసం ముగింపు గ్రామసభ

**సీతారామపురం డిసెంబర్ 3 ప్రభాతవార్త :** సీతారామపురం మండలకేంద్రంలోని రైతు సేవాకేంద్రంలో రైతన్న మీకోసం ముగింపు గ్రామ సభ బుధవారం జరిగింది. ఈగ్రామ సభకు ఉదయగిరిలోని మేకపాటి గౌతంరెడ్డి అగ్రికల్చర్ విశ్వవిద్యాలయ విద్యార్థులు ప్రత్యేకంగా హాజరైయ్యారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి పి.చెన్నారెడ్డి మాట్లాడుతు నవంబర్ నెల 24 వ తేది నుండి 29 వ తేది వరకు ఇంటింటికి వెళ్ళి రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు.ఈ నేపద్యంలో బుధవారం ముగింపు గ్రామ సభ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.నీటి భద్రత ,డిమాండ్,ఆదారిత పంటలు, ప్రభుత్వం నుండి మద్దతు,పాడిరైతులకు అండ, కార్యక్రమాల గురించి రైతులకు వివరించామన్నారు. రబీసీజనల్ పంట సాగుపై ప్రణాళికను సిద్దం చేస్తున్నట్లు తెలిపారు. వివిధ పంటలలో వచ్చు తెగుళ్ళు పురుగుల నివారణ గురించి అగ్రికల్చర్ కాలేజి ఉదయగిరి కీటకశాస్త్ర వేత్త గిరి సలహాలు సూచనలు ఇవ్వడం జరిగిందని అన్నారు.ఈకార్యక్రమంలో టిడిపి మాజీ మండల కన్వీనర్ వెంగలశెట్టి వెంకటేశ్వర్లు, మండల టిడిపి యూత్ అద్యక్షులు పసుపులేటి వికాస్ బాబు, ఏఇఒ సుధీర్‌కుమార్, ఏఎంసి యార్డు అసిస్టెంట్ చిరంజీవి, వివిఎ పవన్‌కుమార్, పూజిత, కూటమి నాయకులు,రైతులు పాల్గొన్నారు.



## దివ్యాంగులు ఆత్మస్థైర్యాన్ని కలిగి ఉండాలి

**కావలి,డిసెంబర్ 3 ప్రభాతవార్త :** దివ్యాంగులు ఎందులోనూ తక్కువ కారాదని ప్రతి దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో మెలగాలని మండల విద్యాశాఖ అధికారులు బండి గోవిందయ్య, సిహెచ్ వెంకట సుబ్బయ్యలు తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం కావలి హరిజనపాలెం పురపాలక సంఘం ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో భవితసెంటర్ నందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ, సిహెచ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి దివ్యాంగులు ఆత్మస్థైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షులు మాదవరెడ్డి, వికలాంగుల అధ్యక్షురాలు నాగమణి. భవిత సెంటర్ ఉపధ్యాయుని మంచికలపాటి లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఆర్ఎస్ఆర్ విద్యార్థులచే ఎయిడ్స్ బాధితులకు వితరణ

**బిట్రగుంట డిసెంబర్ 3 ప్రభాతవార్త** బోగోలు మండలం కడనూతుల గ్రామంలో గల రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఈఈఈ డిపార్ట్మెంట్ సౌజన్యంతో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సహాయ సహకారాలతో డిసెంబర్ ఒకటి ఎయిడ్స్ డేని పురస్కరించుకొని తాళ్లపాలెంలోని రూరల్ హెల్త్ సెంటర్ లో ఉన్న ఆర్వెన్స్కు వితరణ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పివిఎన్ రెడ్డి తెలిపారు. వారు మాట్లాడుతూ తాళ్లపాలెంలో ఉన్న రూరల్ హెల్త్ సెంటర్ లో ఉన్న అనాధ బాలబాలికలకు, ఎయిడ్స్ పేషెంట్లకు వితరణగా బియ్యము, కందిపప్పు, చింతపండు, కాస్మోటిక్స్, పండ్లు, బిస్కెట్లు, ప్లేటు గ్లాసులు తదితరులు వారికి అందజేసినట్లు తెలిపారు. అలాగే ముంగమూరు కూడలిలో గల ఎయిడ్స్ ఆదరణ కేంద్రము లో ఉన్న అనాధలకు కూడా పండ్లు, బిస్కెట్స్ తదితర ఐటమ్స్ ను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏవో ఆర్ వి రమణారెడ్డి, ఈఈఈ హెచ్ ఓ డి డాక్టర్ వి. రవీంద్రారెడ్డి, ఎన్ఎస్ఎస్ సమన్వయ కర్త ఏ కిరణ్ కుమార్,ఈఈఈ డిపార్ట్మెంట్ అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## నీటమునిగిన అంగన్వాడి

**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 3, ప్రభాతవార్త:** మండలంలోని మాచర్లవారి పాలెం హరిజనవాడలో ఉన్న అంగన్వాడి కేంద్రం గత నాలుగు రోజులుగా కురుస్తున్న దిత్వా తుఫాన్ వర్షాల ప్రభావంతో పూర్తిగా నీటమునిగిపోయింది. ఎడతెరపి లేకుండా వర్షాలు కురవడంతో కేంద్రం చుట్టూ నీరు నిలిచిపోయి, లోపల ఉన్న పప్పు, ఉప్పు, బియ్యం, ఇతర పోషకాహార పదార్థాలు తడిసిపోవడం వల్ల పూర్తిగా దెబ్బతిన్న పరిస్థితి ఏర్పడింది. కేంద్ర భవనం పాడైపోవడం వల్ల పిల్లల ప్రాణ భద్రత పణంగా పెట్టినట్లే అవుతుందని సిబ్బంది తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కొనసాగితే ఇంకా తీవ్రమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని భవనం స్థితిని పరిశీలించి, తక్షణ చర్యలు చేపట్టాలని, అంగన్వాడి కేంద్రానికి కొత్త నూతన భవనం నిర్మాణం జరపాలని కోరుతున్నారు. నీరు నిలిచిపోకుండా డ్రెయినేజీ మార్గం అత్యవసరంగా ఏర్పాటు చేయాలని వినతి పలుకుతున్నారు. ప్రస్తుత సదుపాయాల విషయంలో అధికారుల నిర్లక్ష్యం తీవ్రమైందని గ్రామస్తులు ఆరోపిస్తూ, పిల్లల భద్రత దృష్ట్యా తాత్కాలిక వసతి కూడా తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు కూడా దీనిపై వెంటనే స్పందించాలని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు.

## దివ్యాంగుల దినోత్సవం

**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 3, ప్రభాతవార్త :** మండలంలోని భవిత సెంటర్‌లో ప్రపంచ దివ్యా ంగుల దినోత్స వం ఉత్సా హంగా జరిగింది. జిల్లా అకాడమిక్ పర్యవేక్షణ అధికారి శ్రీధర్ మాట్లాడుతూ తల్లిదండ్రులే పిల్లల మొదటి గురువులు అని తెలియజేశారు. సమగ్ర సహిత విద్య సమన్వయకర్త ప్రసాద్‌మాట్లాడు తూ దినోత్స వం కార్యక్రమం మాత్రమే కాదు.. పిల్లల సామర్థ్యాలను గుర్తించే అవకాశంఅన్నారు. మండల విద్యాధికారి వేణుగోపాలరెడ్డి,జయరాంనాయుడు ప్రభుత్వం అందించే అవకాశాలను తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలి అని సూచించారు. జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రియాజ్ అహ్మద్ దివ్యాంగ పిల్లల్లోని నైపుణ్యాలను వెలికితీస్తేవారు సమాజంలో ఏదైనా సాధించగలరుఅన్నారు. ప్రధానోపాధ్యా యులు, ప్రత్యేక ఉపాధ్యాయులు,ఐఇఆర్పీలు,తల్లిదండ్రులుపాల్గొన్నారు.పిల్లలకు ఆటపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.



## వేమారెడ్డిపై ఆప్యాయ స్మృతులతో కన్నీటి నివాళి అర్పించిన కాకాణి

**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 3, ప్రభాతవార్త:** మండలంలోని చిన్న చెరుకూరు గ్రామంలో వైకాపా నేత వేమారెడ్డి సుబ్బారెడ్డి మృతి చెందడంతో గ్రామమంతా విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి శనివారం గ్రామానికి చేరుకుని వేమారెడ్డి భౌతిక గాయానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన, ధైర్యంగా ఉండాలని కోరుతూ తన సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా రాజకీయ ప్రస్థానంలో వేమారెడ్డితో గడిపిన మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ప్రజల సేవలో ఆయన చూపిన నిజాయితీ, అందరికీ అందుబాటులో ఉండే స్వభావాన్ని అభినందించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మండల వైకాపా నేతలు, చిన్న చెరుకూరు గ్రామ వైకాపా నాయకులు పాల్గొన్నారు.



## అనారోగ్యంతో తలారి గంటా వెంకటయ్య మృతి

**సైదాపురం, డిసెంబర్ 3, ప్రభాతవార్త :** మండల పరిధిలోని చాగణం గ్రామ రెవెన్యూ తలారిగా విధులు నిర్వహిస్తున్న గంటా వెంకటయ్య అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఈ సందర్భంగా ఏపీ వీఆర్ఏ అండ్ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ సంఘం రాష్ట్ర కార్యదర్శి, ఏపీ జేఏసీ రాష్ట్ర కమిటీ మెంబర్ నెల్లూరు అంకయ్య ఆధ్వర్యంలో మం డలం లోని వీఆర్ఏలు హాజరై గంటా వెంకటయ్య మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



## బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాల్టీలో ట్రాఫిక్ రద్దిని తగ్గించేందుకు చర్యలు తీసుకోండి

**బుచ్చి డిసెంబర్ 3 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటి గుండా వెళ్ళే జాతీయ రహదారి -67పై ( చుంచులూరు నుండి నెల్లూరు వరకు ) లోడ్ బేరింగ్ పేవర్ బ్లాక్‌ల నిర్మాణం చేపట్టాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ చైర్మన్ సంతోష్‌కుమార్ యాదవ్‌ను ఢిల్లీలో ఆయన చాంబర్‌లో కలుసుకొని వినతి పత్రం సమర్పించారు. ప్రస్తుతం బుచ్చిరెడ్డిపాలెం పట్టణ పరిధిలో ట్రాఫిక్ రద్దీ తీవ్రమైన సమస్యగా మారిందని దీని కారణంగా తాత్కాలిక షెడ్‌లు, నెట్టుడు బండ్లు రూపంలో రోడ్డుపై అక్రమణలు పెరుగుతున్నాయన్నారు. వాహనాలు సక్రమంగా పార్కింగ్ చేయకపోవడం,పాదచారులకు సురక్షితమైన,ప్రత్యేక ఫుట్‌పాత్ లేకపోవడం సమస్యగా మారిందని వివరించారు.దీంతో ప్రజలకు అసౌకర్యంగా ఉండడంతోపాటు తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఇటీవల రహదారి విస్తరణలో భాగంగా రహదారిపై ఉన్న ఆక్రమణలు తొలగించడం జరిగిందని చెప్పారు. బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ పరిధిలో జాతీయ రహదారిపై -67పై లోడ్ బేరింగ్ పేవర్ బ్లాక్‌ల నిర్మాణా పనులను చేపట్టాలని కోరారు.దీనికి స్పందించిన సంతోష్‌కుమార్ తప్పకుండా వినతులను పరిశీలించి బుచ్చిరెడ్డిపాలెంలో ట్రాఫిక్ నియంత్రణకు లోడ్ బేరింగ్ పేవప్ బ్లాక్స్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



## జొన్నవాడ కామాక్షితాయి సన్నిధిలో కృత్తికాదీపోత్సవం

**బుచ్చి డిసెంబర్ 3 ప్రభాతవార్త** జొన్నవాడ కామాక్షితాయి సన్నిధిలో మార్గశిర మాసం కృత్తికా నక్షత్రం సందర్భంగా కృత్తికా దీపోత్స వం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు, వేద పండితులు,ప్రత్యేకంగా అఖండ దీపం ఏర్పాటు చేసి గణపతి పూజ,పుణ్యాహవచనం చేసి తదుపరి అఖండ దీపారాధనకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరంభక్తులు ఆవు నెయ్యి సమర్పించి దీపంను దర్శించు కొని తీర్ధ ప్రసాదములు స్వీకరించారు. ఈకార్యక్రమానికి బంగోలు కి చెందిన కె ధరణి కృష్ణ,కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహారించారు. దేవస్థాన చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, దేవస్థాన సహాయ కమీషనర్ కార్యనిర్వహ ణా ధికారి ఆర్వ భూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, పాలక మండలి సభ్యులుజొన్నలగడ్డ వరలక్ష్మీ,పాలూరు చాముండేశ్వరీ, కీలు కుప్పశ్రీనివాసులు,జొన్నవాడసర్పంచ్‌కందికట్టుపెంచలయ్య,ఆలయఅర్చకులు, సిబ్బంది,భక్తులు పాల్గొన్నారు.



## దిత్వా తుపాన్ బాధితులకు బాసటగా ఎస్ఈఐఎల్ ఎనర్జీ

**- పైనాపురంలో తుఫాను బాధితులకు ఉచిత ఆహార సరఫరా**

**ముత్తుకూరు, డిసెంబర్ 3, ప్రభాత వార్త:** ముత్తుకూరు మండలం పైనాపురం పంచాయతీ పరిధిలోని చిన్న సంగం దిత్వా తుపాన్ పునరావాస కేంద్రంలో తుఫాను బాధిత కుటుంబాలకు ఎంఆ ర్‌ఓ జె. స్వప్న వినతి మేరకు ఎస్ఈ ఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ వారు సిఎస్ఆర్‌లో భాగంగా ఉచిత ఆహార సరపరా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కంపనీ సిఎస్ఆర్ ప్రతినిధులు, గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు, వీఆర్ఓ, పంచాయతి సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.



## అంతర్జాతీయ సైన్స్ ఫెస్టివల్ కు ఏ.వి సుధాకర్ ఎంపిక



**బిట్రగుంట డిసెంబర్ 3 ప్రభాతవార్త** సామాన్య ప్రజలకు శాస్త్ర విజ్ఞానాన్ని దగ్గర చేర్చే ఉద్దేశంతో భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ ,భారతీయ భూవిజ్ఞాన మంత్రిత్వ శాఖ, సి ఎస్ ఐఆర్ సంయుక్తంగా 6తేదీ నుండి 9వ తేదీ వరకు పంజాబ్, హర్యానల ఉమ్మడి రాజధాని అయిన చండీగర్లో ప్రతిష్టాత్మక ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ జరగనుంది. దేశ ,విదేశాల్లోని ప్రముఖ మేటి శాస్త్రవేత్తలు, నోబుల్ శాస్త్రవేత్తలు పాల్గొనే ఈ కార్యక్రమానికి బోగోలు మండలం చెన్నారాయుని పాలెం ఉన్నత పాఠశాల భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు ఏ.వి .సుధాకర్ మూడు విభాగాలలో ఎంపికైనారు. ఎడ్యుకేటర్స్,టీచర్స్ కి ప్రత్యేకంగా నిర్వహించే గురుకుల వర్క్ షాప్ లో పాల్గొని విజ్ఞాన శాస్త్ర బోధనలో నూతన పోకడలపై చర్చించే గొప్ప అవకాశం సుధాకర్ కు లభించింది. అదేవిధంగా సైన్స్ సఫారీ కార్యక్రమంలో విజన్ ఆఫ్ వికసిత్ భారత్ 2047 లో ఉపాధ్యాయుని పాత్ర , నేటి సాంకేతిక యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాముఖ్యతను ప్రజెంట్ చేసే అవకాశం కలిగింది . తన తల్లి గారి పేరు పై నెల్లూరులో సొంత ఇంటిపై సుమారు 15 లక్షల రూపాయలతో నిర్మించిన కిడ్స్ సైన్స్ కార్నర్ ఏర్పాటు ,దాని ద్వారా విద్యార్థులకు అందజేస్తున్న వైజ్ఞానిక అంశాలను ప్రదర్శన ద్వారా వివరించనున్నారు. దేశవ్యాప్తంగా అనేకమంది ఈ సైన్స్ ఫెస్టివల్ కు రిజిస్ట్రేషన్ చేసుకోగా అతి కొద్ది మందికి మాత్రమే అవకాశం దొరికింది. అందులో మన రాష్ట్రం నుండి చాలా తక్కువ మంది ఎంపిక కావడం అందులో మన జిల్లా నుండి సుధాకర్ ఒక్కడే ఎంపిక కావడం గమనార్హం.సుధాకర్ గతంలో అనేక జాతీయ,అంతర్జాతీయ సెమినార్లల్లో, సదస్సులలో పాల్గొన్న అనుభవం కలదు.విద్యార్థులను కూడా రాష్ట్ర, జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్లకు తీసుకుని వెళ్ళినాడు. పుస్తక రచయితగా కాలమిస్ట్‌గా పలు దినపత్రికలకు, సైన్స్ కోఆర్డినేటర్ గా పని చేసిన అనుభవం కలదు. సుధాకర్ సైన్స్ ఫెస్టివల్ ఎంపికైనట్లు డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వారు పంపిన ఇన్విటేషన్ లెటర్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు సార్ చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జెసి ఎం. వెంకటేశ్వర్లు సుధాకర్‌ను ప్రత్యేకంగా అభినందించా రు.పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం, జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఆర్ బాలాజీ రావు కావలి డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ హరి ప్రసాద్,బోగోలు మండల విద్యాశాఖ అధికారి నర్సింహారావు జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి జి సుధీర్‌బాబు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై శ్రీనివాసులు పాఠశాల విద్యా కమిటీ సభ్యులు, గ్రామస్తులు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు ,విద్యార్థిని, విద్యార్థులు సుధాకర్‌ని అభినందించారు.

## అకడమిక్ ఇనస్టెక్టర్ పోస్టుకు ధరఖాస్తు చేసుకోండి



**బుచ్చి డిసెంబర్ 3 ప్రభాతవార్త** డిఎల్ఎన్ఆర్ హైస్కూల్ లో అకడమిక్ ఇనస్టెక్టర్ ( స్కూల్ అసిస్టెంట్ శ్యాన్స్‌క్రీట్) సంస్కృతి పోస్టు కు 5వతేదీ లోపు ధరఖాస్తు చేసు కోవాలని ఎంఇఓ ఎం.దిలీప్‌కుమార్ తెలి పారు. అర్హతలు డిగ్రీ,శ్యా న్స్‌క్రీట్ మెయిన్ సబ్జెక్ట్ ,బిఇడి చేసి ఉండాలని అన్నారు.అప్లికేషన్ ఎంఇఓ కార్యాల యంలో దొరుకుతుందని చెప్పారు.పూర్తి వివరాలకు ఎంఇఓ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

## దివ్యాంగులకు ఆత్మస్థైర్యం ఎక్కువ



**బుచ్చి డిసెంబర్ 3 ప్రభాతవార్త** దివ్యాంగులకు ఆత్మస్థైర్యం ఎక్కువ అని తెలుగుదేశం నాయకు లు,హాస్పటల్ డైరక్టర్ దొడ్ల కోండరామిరెడ్డి తెలి పారు .ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా భవితాకేంద్రంలో వేడుకలు నిర్వహించారు.ఈకార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గోన్న ఆయన మాట్లాడుతు నేడు అనేక మంది దివ్యాంగులు అంగవైకల్యాన్ని జయించి ఉన్నతశిఖరాలు అధిరోహించారని ఆయన ప్రశంసించారు.అనంతరం ఎంపిడిఓ రంతులయ్య,ఎంఇఓ దిలీప్‌కుమార్ -1 , ఎంఇఓ-2 రత్నం మాట్లాడుతు విద్య,క్రీడలు,వాణిజ్యంతోపాటు వారికి భరోసా కల్పిస్తే ఏ రంగంలో నైనా రాణిస్తారని అన్నారు. విద్యాశాఖ,సమగ్రశిక్ష ఆద్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలను తల్లిదండ్రులకు వివరించారు. ఈకార్యక్రమంలో భాగంగా అతిదులు దివ్యాంగుల చేత కేకులు కట్ చేయించారు.లైయన్ క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ దర్శి బాల నంసింహరావు, దర్శి శిరీషా దంపతులు విద్యార్థులకు గొడుగులు పంపీణి చేశారు. అలాగే లయన్స్‌క్లబ్ వారు బోజనం అందజేశారు.దొడ్ల కోదండరామిరెడ్డి చాపలు అందజేశారు. ఈకార్యక్రమంలో బెజవాడ శ్రీనాద్‌రెడ్డి, బాలికల హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయులు,సామాజికవేత్త గండికోట సుదీర్ కుమార్,లయన్స్‌క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ తెల్లనాకుల వెంకటేశ్వర్లు, సహిత విద్యా ఉపాధ్యాయులు శేషమ్మ, నారాయణ, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ కార్గో హ్యాండ్లింగ్లో రికార్డు



**ముత్తుకూరు, డిసెంబర్ 3, ప్రభాతవార్త** అదాని కృష్ణపట్నం ఓడరేవులోని యాంత్రిక బెర్త్‌లో ఒకే ఒక్క రోజులో 132800 మెట్రిక్ టన్నుల అత్యధిక పరిమాణాన్ని నిర్వహించడం జరిగింది. గతంలో గరిష్టంగా 2025 ఏప్రిల్ 20న 131966 మెట్రిక్ టన్నులు నిర్వహించారు. అంతకంటే నేడు ఎక్కువ కార్గో హ్యాండిల్ చేయడంతో పోర్ట్ సరి కొత్త రికార్డును నెలకొల్పింది. ఎకెపిఎల్ సిఇఓ జగదీష్ పటేల్ ఆ యొక్క బృందాన్ని అభినందిస్తూ ఆయన మాట్లాడుతూ ఈ మైలు రాయిని సాధించడంలో యాంత్రిక బెర్తు నిజంగా సహాయ పడ్డాయని అన్నారు. యాంత్రిక వ్యవస్థలు మరియు జట్టు కృషి ఉద్గారాలను తగ్గించడంతో కార్యాచరణ సామర్థ్యాన్ని పెంచాయి అన్నారు. అలాగే అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ నవంబర్ 2025లో అత్యధిక నెలవారీ ఎరువుల సరుకును 0.43 ఎంఎంటీలను విజయవంతంగా నిర్వహించిందని, గతంలో డిసెంబర్ 2023లో 0.36 ఎంఎంటీల కంటే నేడు అధిగమించిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**- అదాని ఫౌండేషన్‌చే గిరిజనులకు ఆహారం పంపిణీ** అదాని కృష్ణపట్నం పోర్టు అదాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో తుఫాను కారణంగా ముత్తుకూరు మండలంలోని చలివేంద్ర గిరిజన కాలనీ ముత్తుకూరు ఎస్‌టి కాలనీ, అలాగే కృష్ణపట్నం గిరిజన కాలనీలో సుమారు 600 మందికి బుధవారంఆహారాన్ని పంపిణీ చేసారు. ఆదాని కృష్ణపట్నం పోర్టు సీఈవో జగదీష్ పటేల్ ఆదేశాల మేరకు తుఫాను కారణంగా గిరిజనులకు ఆహార అందించారు. అదాని కృష్ణపట్నం పోర్టు అదాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆహారాన్ని అందించడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## ఉధృతంగా ములుముడి కలుజు



**నెల్లూరు అగ్రికల్చర్, డిసెంబర్ 3, ప్రభాతవార్త** నెల్లూరు-తాటిపర్తి మార్గంలో ములుమూడి చెరువు కలుజు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆ టోలు ద్విచక్ర వాహనదారులు కలుజుపై ప్ర యాణం సాగించలేక అవస్థలు పడుతున్నారు. ప్రతి ఏటా తుఫాన్లు, వరదలు సంభవించిన సమయాల్లో ఈకలుజు వద్ద వాహనాల రాకపోకలకు ఆటంకాలు ఏర్పడడం పరిపాటిగా మారింది. కొన్ని సమయాల్లో నీటి ఉధృతికి ఆటోలు, ద్విచక్ర వాహనాలు సైతం కొట్టుకుపోయిన సందర్భాలు ఉన్నాయి. దిత్వా తుఫాన్ కారణంగా ఈ ఏడాది కూడా ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. పాలకుల వాగ్దానాలు ఆచరణకు నోచుకోకపోవడంతో ఈ కలుజు వద్ద ప్రతి ఏటా వాహనాల రాకపోకలు స్తంభిస్తున్నాయి. అంతే కాకుండా కలుజుపై గుంతలు ఏర్పడడంతో ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలో ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక, వాహనదారులు ఆ గుంతల్లో పడి ప్రజలు గాయాలపాలవుతున్నారు. ఈ కలుజుపై త్వరితగతిన బ్రిడ్జిని నిర్మించి వాహనాల రాకపోకలు సజావుగా సాగేలా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## పలు కేసుల్లో నిందితుడు అరెస్టు



**కావలి,డిసెంబర్ 3 ప్రభాతవార్త** :పట్టణానికి చెందిన నిందితుడు దేవంకొండ సుదీర్‌పై అనే పాత నేరస్తుడని కావలి రెండవ పట్టణ పోలీసుల అరెస్టు చేయడం జరిగింది. బుధవారం ఈ కేసుపై డిఎస్పి శ్రీధర్ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎస్‌పి అజిత్ వేజెండ్ల ఆదేశాల మేరకు డిఎస్‌పి శ్రీధర్ ఆధ్వర్యంలో సిఐ గిరి బాబు తన సిబ్బందితో దేవరకొండ సుదీర్‌ను తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ తనిఖీల్లో అతని వద్దనుంచి రూ.6.24లక్షలు విలువగల గంజాయి, వెంటి, బంగారు, రోల్డ్‌గోల్డ్, హార్డ్‌డిస్కులు, క్యాష్‌కౌంటింగ్ మిషన్, బ్రీఫ్‌కేసులు స్వాదీనం పరుచుకొన్నట్లు తెలిపారు. సుదీర్‌పై గతంలో 40కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఒడిస్సా, ఆంధ్రా సరిహద్దుల్లో గంజాయిని కొనుగోలుచేసి ఇతర ప్రాంతాలకు అమ్ముతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కావలి టూటౌన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బుచ్చిలో వేడుకగా గంధమహోత్సవం



**బుచ్చి డిసెంబర్ 3 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలో బుధవారం అత్యంత వేడుకగా గంధ మహోత్సవం నిర్వహించారు. అద్యాత్మి సత్‌గురువు హజరత్ జర్ర నవాజ్ మహబూబ్ రహమాని ఖాజా అబుల్‌ఫైజ్ ఖాలిద్ వజూది హైదరాబాద్ వాసివారి శిష్యబృందం అనేకమంది ఖాజానగర్‌లో వున్నారు.వారి పేరిట ఉర్సు నిర్వహించడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.ఖాజనగర్‌లో ఉన్న ఆస్తానయె ఖాదరియా నుండి రకరకాల మేళతాళాలతో పూలతో అలంకరించబడిన గుమ్మటంతో అత్యంత వైభవంగా గంధమహోత్సవం నిర్వహించారు. అక్కడే దీనికి సంబందించిన కార్యక్రమాలు మూడు రోజులు జరుగుతాయి. పీఠాదిపతి అయిన ఖాజా అబుల్ ఇర్ఫాన్‌షా ముహమ్మద్ అబ్దుల్ అజీజ్‌ఖాలిది గారి నాయకత్వంలో అన్నీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.ఈ గంధ మహోత్సంలో అనేక మంది ఆద్యాత్మిక గురువులు పాల్గొంటారు. మూడురోజుల ఖవ్వాలీల పాట కచ్చేరి ఆద్యాత్మిక సభలు,పవిత్ర గ్రంధమైన ఖురాన్ పఠనం జరుగుతుంది. ఇందులో పాల్గోన్న భక్తులందరికి సహపంక్తి బోజనాలు ఏర్పాటు చేయడం జరిగింది.ఈ గంధమహోత్సవంలో పెద్దఎత్తున భక్తులు పాల్గోన్నారు.

## ఓవెల్‌లో రవాణా భద్రతపై అవగాహన సదస్సు




**నెల్లూరు,డిసెంబరు3 ప్రభాతవార్త-విద్య** బుధవారం నగరంలోని స్థానిక ఓవెల్ పాఠశాలలో విద్యార్థులకు రవాణా భద్రత పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా నగర మెటార్‌వెహికల్ ఇన్స్పెక్టర్లు సిహెచ్.రాంబాబు, ఎస్‌కే.మహ్మద్‌రఫీలు పాల్గొని మాట్లాడారు. నగరంలో జరుగుతున్న ప్రమాదాలు, వాటి వలన జరుగుతున్న ప్రాణ నష్టాల గురించి వివరించారు. 18 సంవత్సరాలు నిండకుండా ఉన్న విద్యార్థులు, పిల్లలు మెటారు వాహనాలను వినియోగిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలుతీసుకోవటం జరుగుతుందని, అంతే కాక వాహనాన్ని మైనర్లకు ఇచ్చిన వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్లు పాఠశాలలకు వచ్చేప్పుడు వారి తల్లిదండ్రులతోగానీ, లేదా పాఠశాలల వాహనాల్లోగానీ రావాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ రోడ్డు నియమాలను తప్పని సరిగ్గా పాటించాలని కోరారు. యువత క్రమశిక్షణతో మెగిలి బాగా చదువుకొని ఉన్నత శికరాలకు చేరుకోవాలన్నారు. మద్దుపదార్దాలు ,చెడు వ్యసనాలు వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓవెల్ విద్యాసంస్థల ఛైర్మన్ రంగిశెట్టి వేణు, సిఈఓ ప్రమీల, జిఎం మహదేవ్, ఈడి బాలు, డిజిఎం రఫీ, ఎజిఎం గంగాధర్, ప్రిన్సిపాల్ రమణయ్య, ప్రదానోపాధ్యాయులు మీనాక్షి, మహేశ్వరి, సిబ్బంది రాజేశ్వరి, గిరిధర్, రహమతున్నీసా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ చంద్రప్పను సత్కరించిన బిజెపి కావలి పట్టణశాఖ



**కావలి,డిసెంబర్ 3 ప్రభాతవార్త** :తిరుపతిజిల్లా బిజెపి మాజీ అధ్యక్షులు డాక్టర్ బి.చంద్రప్ప కావలి భారతీయ జనతాపార్టీ కార్యాలయంకు విచ్చేశారు. ఈ సందర్భంగా కావలి పట్టణశాఖ ఆధ్వర్యంలో చంద్రప్ప దంపతులను ఘనస్వాగతం పలికి శాలువలతో సత్కరించారు. మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయా లన్నారు. ఈ కార్యక్రమ కంలో జిల్లా టెలికాం అడ్వైజరీ సభ్యులు కుట్టుబోయిన బ్రహ్మానందం, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కంచర్ల మురళీక్రిష్ణ నాయుడు, పి.వెంకటేవర్లు, పాతపాటి వెంకటరమణారెడ్డి, పట్టణ అధ్యక్షులు మందకిరణ్‌కుమార్, కోడూరు మురళీక్రిష్ణ, కార్యదర్శి శ్రీనిక్‌కుమార్, జైన్ యువమోర్చా ప్రధాన కార్యదర్శి దేవాండ్ల రాకేష్ పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంతాల్లో పర్యటించిన గిరిధర్‌రెడ్డి



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 3, ప్రభా తవార్త** నెల్లూరు నగరంలో మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి వేకువజామునే ఫీల్డ్‌లోకి దిగారు. బుధవారం ఉదయం 4గంటల నుంచే మాగుంట లేఅవుట్, గోమతినగర్, మినీబైపాస్, సప్తగిరి లేఅవుట్, రవీం ద్రానగర్, ఆర్టీసీకాలనీ, అయ్యప్ప గుడి హైవే జంక్షన్ వంటి ప్రాంతాలను విస్తృతంగా పర్యటించారు. కొన్ని ప్రాంతాల్లో నిలిచిన వర్షపు నీటిని పంట కాలువల ద్వారా విడుదల చేయాలని కార్పొరేషన్ అధికారులను ఆదేశిం చారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, ఏ అవసరం వచ్చినా వెంటనే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయాన్ని సంప్రదించాలని సూ చించారు. ఈ పర్యటనలో కార్పొరేషన్ ఈఈ శేషగిరిరావు, క్లస్టర్ ఇన్‌చార్జి నూకరాజు, మదన్ కుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు చేజర్ల మహేష్‌బాబు, బద్దెపూడి నరసింహగిరి తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు రూరల్‌లో గృహ మంజూరు పత్రాల పంపిణీ



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 3, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని 30వ డివిజన్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో గృహ నిర్మాణ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొని లబ్దిదారులకు పత్రాలను అందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ఇప్పటి వరకు నియోజకవర్గంలో 819 పక్కా గృహాలు మంజూరు చేసిన విషయాన్ని ఆయన వెల్లడించారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దరఖాస్తు చేయాలని ఆయన సూచిం చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి పని చేస్తున్నామని కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సహకారంతో రూరల్ ప్రాంతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరుగుతుందని, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సారధ్యంలో అభివృద్ధి పథకాలు వేగంగా అమలు అవుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నెల్లూరు రూరల్ అభివృద్ధికి అందిస్తున్న సహకారానికి నియోజకవర్గ ప్రజల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీదర్‌రెడ్డి ప్రసంగించారు. క్లస్టర్ ఇన్‌చార్జి మన్నేపల్లి రఘు, కో క్లస్టర్ ఇన్‌చార్జి పల్నాటి మస్తాన్ నాయుడు, 30వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు అత్తివరపు యానాదయ్య, టీడీపీ నాయకులు ఓబుల్ రాజు, విఘ్నేశ్వరరావు, అట్ల విజయ్ కుమార్, ఖాజా, జనసేన నాయకుడు కరీం తదితరులు పాల్గొన్నారు.

## ఏఎంసి ఛైర్మెన్ అలేఖ్యను సత్కరించిన ప్రసాద్‌రెడ్డి



**కావలి,డిసెంబర్ 3 ప్రభాతవార్త** :వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ పోతుగంటి అలేఖ్య జన్మదిన వేడుకలు బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా కేక్‌కట్‌చేసి తినిపించుకొన్నారు. పట్టణానికి చెందిన కాంట్రాక్టర్ నోటీ ప్రసాద్‌రెడ్డి అమెను కలసి దుశ్శావాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఏఎంసి కెఎంసి ఛైర్మెన్ స్వర్గీయ గ్రంది యనాదిశెట్టి తనయురాలు పోతుగంటి అలేఖ్యను సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్బంగా రానున్న రోజుల్లో మరెన్నో ఉన్నత పదవులు ఆదిరోహించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు అభిమానులు పాల్గొన్నారు.

## నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డితో మాజీ మంత్రి ప్రసన్నకుమార్ రెడ్డి భేటీ



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 3, ప్రభాతవార్త** : నెల్లూరు జిల్లా వైసీపీ సీని యర్ నాయకులు వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ నేదురు మల్లి రామ్‌కుమార్ రెడ్డిని నెల్లూరులోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి, గూడూరు నియోజ కవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపే ప్రక్రియపై చర్చించిన. వైసీపీ రాష్ట్ర PAC సభ్యులునల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి ఈ సమా వేశంలో చిల్లకూరు మండల కన్వీనర్ మధురెడ్డి, మల్లువిజయ్ కుమా ర్‌రెడ్డి, చిట్టమూరురాజారెడ్డి పలగాటి సంపత్ కుమార్ రెడ్డి గారు, వీరి చలపతిరావు, కొండూరు అనీల్ బాబు, నల్లపరెడ్డి రాజేంద్ర కుమార్ రెడ్డి, కలువ బాల శంకర్ రెడ్డి గారు, చిల్లకూరు సాయి ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు




## గంజాయిని అరికట్టడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

### గంజాయి విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోండి
### సమాచారం తెలిస్తే పోలీసులకు తెలపండి, పేర్లు గోప్యంగా వుంటాయి
### డ్రగ్స్ రహిత కోవూరు నా లక్ష్యం : ఎమ్మెల్యే




**కోవూరు డిసెంబర్ 3 ప్రభాతవార్త** ఎమ్మె ల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆధ్వర్యంలో కోవూరు నియోజకవర్గ తెలుగు యువత గం జాయికి వ్యతిరేకంగా గళం విప్పింది. నెల్లూరు నగరం మాగుంట లేఔట్‌లోని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి నివాసంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సమక్షంలో కోవూరు తెలుగు యువత నాయకులు గంజాయి వద్దు బ్రో" పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ స్ఫూర్తితో గంజాయి రహిత కోవూరు సాధన కోసం కృషి చేస్తానన్నారు. కోవూరు నియోజకవర్గ పరిధిలో గంజాయి అమ్మకాలు సేవనం జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులను ఆదేశించారు. యువతను చైతన్య పరచడానికి గంజాయి వద్దు బ్రో" అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన కోవూరు తెలుగు యువత నాయకులను ఈసందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అభినందించారు. గంజాయిని అరికట్టడంలో ప్రజల సహకారం అవసరమని గంజాయికి సంబంధించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలపాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తిచేశారు.సమాచారం అందించిన వారి పేర్లు పోలీసులు గోప్యంగా వుంచుతారని ఎమ్మె ల్యే ప్రశాంతిరెడ్డి భరోసా ఇచ్చారు.టీడీపీ సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, వేమారెడ్డి బాలకృష్ణారెడ్డి,కేతంరెడ్డివినోద్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ తెలుగు యువత నాయకులు సాయిజయంత రెడ్డి,సాయి తేజరెడ్డి, టిడిపి ఇందుకూరు పేట, బుచ్చి టిడిపి అధ్యక్షులు ఏకొల్లు పవన్‌కుమార్‌రెడ్డి, గుత్తా శ్రీనివాసరావు, యువ నాయకులు గురు మహేష్,హరి,లోకేష్, పవన్, నయాజ్, వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయండి

### వైద్య ఆరోగ్యశాఖాధికారిణి వి . సుజాత



**నెల్లూరు, డిసెంబర్ 3, ప్రభాతవార్త - వైద్యం** టిబీ నిర్మూలనకు వైద్య ఆరోగ్య సిబ్బంది , ల్యాబ్ టెక్నీషి యన్లు మెరుగైన ఫలితాలను అందించి, లక్ష్య సాధనకు కృషి చేయాలని డిఎం అండ్ హెచ్ ఓ వి. సుజాత పేర్కొన్నారు . నెల్లూరులోని వైద్యారోగ్య శా ఖ జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో ల్యాబ్ టెక్నీషియన్ల సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల జరిగిన ఫైలేరియా నైట్ బ్లడ్ సర్వేలో సేకరించిన రక్తపూ తలను సక్రమమైన పద్ధతిలో స్టైన్ చేసి పరీక్షలు నిర్వహించి , ఫలితాలను డిఎంహెచ్వో కార్యాలయానికి నిర్ణీత సమయంలో పంపాలని ఆమె ఆదేశించారు. టీబీ అనుమానిత కేసులను గుర్తించి క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలన్నారు . పాజిటివ్ కేసులకు తగిన చికిత్సను త్వరితగతిన అందేలా చూ డాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఎం అండ్ హెచ్ ఓ ఎస్ కే. ఖాదర్ వలీ , జిల్లా మలేరియా నివారణాధికారి ఈ. హుస్సేనమ్మ మలేరియా నివారణ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు .

## 5న మెగా పేరెంట్,టీచర్స్ మీటింగ్‌లో పాల్గోనన్ను మంత్రి ఆనం



**చేజర్ల డిసెంబర్ 3 ప్రభాతవార్త** చేజర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 5 వ తేదిన జరగనున్న మెగా పేరెం ట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌లో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారా యణరెడ్డి ముఖ్య అతిదిగాపాల్గొంటారని చేజర్లఎంపిడిఓ అమర్ బుధవారం తెలి పారు. విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యా ప్తంగా ఆరోజున ఈ కార్యక్రమాలు జరుగుతాయని తెలి పారు. తల్లిదం డ్రులు ఉపాధ్యయులు మధ్య ఒకమంచి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు ఈ సమావేశాలు తోడ్పడుతాయన్నారు.తల్లిదండ్రులందరు ఈ కార్యక్రమంలో పాల్గోని విజయవంతంచేయాలని ఆయనవిజ్ఞప్తి చేశారు.

## మేయర్ వెంటే ఉంటాం...
## జోరువానను లెక్కచేయని గిరిజన సమాజం




**నెల్లూరుకార్పరేషన్,డిసెంబర్ 3 ప్రభాతవార్త :** మేయర్ స్రవంతి జయవర్ధన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ మేయర్ వెంటే ఉంటామంటూ వానను సైతం లెక్కచేయకుండా యనాది సమాజం అంబేద్కర్ విగ్రహం వద్ద మావనహారంతో గిరిజన సంఘాల నాయకులు, గిరిజనులు నిరసన తెలియజేశారు. గిరిజన యనాదినాయకులు పలు విషయాలు చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ గిరిజన యనాది సమాజం మేయర్ స్రవంతి జవయర్ధన్‌కు సంపూర్ణ మద్దతు పలికారు. నగర అభివృద్ధిలో మేయర్‌చూసిన పారదర్శకత, నాయకత్వాన్ని విస్మరించి చేస్తున్న అవిశ్వాస తీర్మాణం పూర్తిగా రాజకీయ కుట్రే అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసే ఇలాంటిపరిస్థితులు సహించబోమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజనల సంక్షేమ సంఘం బిఎల్ శేఖర్, యనాదుల మహాకూటమి బాపట్ల వెంకటపతి, ముస్లిం మైనార్టీ హుమెన్ సంఘం యనాది యూత్ పెడరేషన్ చౌటూరి రమేష్, సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ పందిటి సుబ్బయ్య, గిరిజన సమాఖ్య సుదీర్, యానది సమాఖ్య కోమరగిరి ప్రసాద్, బహుజన బేరీ గుర్రం ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## వరద ప్రభావిత ప్రాంతాల్లో కమిషనర్ విస్తృతంగా పర్యటన



**నెల్లూరు కార్పరేషన్,డిసెంబర్ 3 ప్రభాతవార్త** : దిత్వ తుపాన్ కారణంగా నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో కురుస్తున్న వర్షాలకు వరద ప్రభా విత ప్రాంతాల్లో కమిషనర్ వైఓ నందన్ బుధ వారం పర్యటించారు. స్థానిక 31వ డివిజన్ శివా జీ నగర్ ప్రాంతంలోని ఉడుములవాగు ఉధ్రుతిని అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. కాలువలన్నీ యుద్ధ ప్రాతిపదికన పూడికతీత పను లు చేపట్టాలని ఆదేశించారు. రోడ్లుపై వర్ష పునీ రు నిల్వఉండ కుండా డివిజన్ అధికారులు, వార్డు సచివాలయాల అన్ని విభాగాల కార్యదర్శులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం, శానిటేషన్ విభాగం, టౌన్‌ప్లానింగ్ అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.